


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575

www.rajamudranews.com
అక్షర
# రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
AKSHARA RAJAMUDHRA
RNI No: TELTEL/2024/86684

విలేకరులు కావలెను
'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.
సంప్రదించాల్సిన చిరునామా..
సెల్ : 9182 474 575

| మేడ్చల్-మల్కాజ్‌గిరి | శుక్రవారం | 17.04.2026 | సంపుటి : 3 | సంచిక: 76 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | FRIDAY | 17.04.2026 | VOLUME : 3 | ISSUE : 76 | PAGES: 8 | COST: 2/- |

# త్వరలో క్యాబినెట్లో మార్పులు చేర్పులు

సీఎం రేవంత్ మార్క్ సిద్ధం !?



- మంత్రివర్గం ప్రక్షాళనకు కసరత్తు
- పలు రాష్ట్రాల ఎన్నికల తర్వాత ముహూర్తం
- సీఎం ప్రకటనతో అలెర్ట్ అయిన అమాత్యులు
- ఇద్దరు మంత్రులపై వేటు పడనున్నట్లు ప్రచారం
- కొత్తగా మంత్రి పీఠం కోసం ఢిల్లీ స్థాయిలో పైరవీలు
- కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పంతం నెగ్గేనా ?
- ఇప్పటికే తీవ్ర అసంతృప్తితో మునుగోడు ఎమ్మెల్యే
- పలుచోట్ల బహిరంగంగా విమర్శలు
- పనితీరు బాగాలేని మంత్రుల శాఖలలోనూ మార్పు తప్పదా?

2

# లోక్‌సభలో మహిళా బిల్లు, డీ లిమిటేషన్ బిల్లులు



- డివిజన్ కోరిన విపక్ష సభ్యులు.. స్పీకర్ అంగీకారం
- సభ ఆమోదంతో బిల్లులు ప్రవేశపెట్టిన మంత్రి అర్జున్

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 16, రాజముద్ర న్యూస్ :** డీలిమిటేషన్ ద్వారా నియోజకవర్గాలను పెంచేందుకు, పునర్విభజించేందుకు, చట్ట సభల్లో మహిళలకు రిజర్వేషన్ కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం మూడు బిల్లులను గురువారం లోక్‌సభ ముందుకు తీసుకొచ్చింది. ఉదయం 11 గంటలకు లోక్‌సభ ప్రారంభం కాగా కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్, హోంమంత్రి అమిత్ షా వీటిని ప్రతిపాదించారు. వీటిని సభలో ప్రవేశపెట్టేందుకు చర్చ చేపట్టారు. బిల్లులను వ్యతిరేకించిన విపక్షాలు డివిజన్ వోటింగ్‌కు పట్టుబట్టగా స్పీకర్ ఓం బిర్లా సమ్మతించారు. డివిజన్


మిగతా 3వ పేజీలో..



## డీలిమిటేషన్ తో అన్యాయం జరగదు

• అమిత్ షా

4



## మహిళా బిల్లులో రాజకీయం లేదు

- 30 ఏళ్లుగా మహిళలు ఎదురు చూస్తున్నారు .. వారికి అవకాశం ఇవ్వడం మన బాధ్యత
- చట్ట సభల్లోనూ వారు సత్తా చాటేలా చేద్దాం.. ఏకగ్రీవంగా ఆమోదించే విపక్షాలకే క్రెడిట్
- డీలిమిటేషన్‌తో దక్షిణాదికి ఎలాంటి అన్యాయం జరగదు
- మహిళా బిల్లుపై పార్లమెంటులో ప్రధాని మోదీ ప్రసంగం

4

తేజస్వీ సూర్, బీజేపీ

• బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

# క్షమాపణ చెప్పాలి



హైదరాబాద్, ఏప్రిల్ 16, రాజముద్ర న్యూస్ : తెలంగాణ ఏర్పాటును దేశ విభజనతో పోల్చుతూ బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య వ్యాఖ్యానించడాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ వ్యతిరేకత బీజేపీ నరనరానా నిండి ఉన్నదంటూ పార్లమెంటు సాక్షిగా

మిగతా 2వ పేజీలో..



## చాక్లెట్ కొనిస్తానని..
# యాసిడ్ తాగించింది!

- నాలుగేళ్ల బాలుడిపై తోడికోడలి అమానుషం
- ఆశచూపి ప్రాణాల మీదకు తెచ్చిన వైనం
- తన కొడుకును నిర్లక్ష్యం చేస్తున్నారనే కక్షతో ఘాతుకం
- ఆసుపత్రిలో మృత్యువుతో పోరాటం
- మేడ్చల్‌మల్కాజిగిరి ఘట్‌కేసర్ పరిధిలో ఘటన

**మేడ్చల్, ఏప్రిల్ 16, రాజముద్ర న్యూస్ :** కుటుంబంలో తలెత్తిన చిన్నపాటి విభేదాలు, అసూయ ఒక పసి ప్రాణాన్ని బలితీసుకునే స్థాయికి చేరాయి. మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ పరిధిలో మానవత్వాన్ని మంటగలిపే ఘటన వెలుగుచూసింది. తోడికోడళ్ల మధ్య ఉన్న మనస్పర్ధలు చివరకు ఏ పాపం తెలియని నాలుగేళ్ల చిన్నారిపై యాసిడ్

మిగతా 2వ పేజీలో..



3

## సాకారం కాబోతున్న సాధికారత

- మహిళా బిల్లుపై బీజేపీ చీఫ్ రామచందర్‌రావు



## హైదరాబాద్‌లో ప్రోటోల్యాబ్స్ జీసీసీ

- మంత్రి శ్రీధర్‌బాబు

2

## పెట్టుబడులు పెట్టేలా ప్రోత్సహించండి

యూఎస్ నేషనల్ కాలేజ్ వార్' ప్రతినిధుల భేటీలో మంత్రి శ్రీధర్ బాబు

2

## ఢిల్లీలో ముఖ్యమంత్రికి ఘన స్వాగతం

- పార్లమెంట్ ఆవరణలో సీఎం రేవంత్ రెడ్డి, ఎంపీ వం నరేందర్ రెడ్డిని సన్మానించిన మంత్రి సీతక్క
- ముఖ్యమంత్రితో మర్యాదపూర్వక భేటీ
- రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రంపై ఒత్తిడి తెచ్చే వ్యూహాలపై దిశానిర్దేశం

3





## కౌంటర్ దాఖలు చేయాలి

- ఫిరాయింపు ఎమ్మెల్యేల వ్యవహారంపై హైకోర్టు ఆదేశాలు
- స్పీకర్ సహ 9మందికి నోటీసులు

**హైదరాబాద్, ఏప్రిల్ 16, రాజముద్ర న్యూస్:** తెలంగాణలో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హత వ్యవహారం మరోసారి చర్చనీయాంశమైంది. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన 9 మంది ఎమ్మెల్యేలు పార్టీ మారలేదని స్పీకర్ ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై గురువారం హైకోర్టు విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది.

మిగతా 2వ పేజీలో..



## నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 135 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 162 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 235 (కిలో) |
| స్కిన్ లెస్ | 267 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹66

# సీఎం రేవంత్ మార్క్ సిద్ధం !?

- క్యాబినేట్ ప్రక్షాళనకు కసరత్తు
- త్వరలో క్యాబినెట్లో మార్పులు చేర్పులు
- పలు రాష్ట్రాల ఎన్నికల తర్వాత ముహూర్తం
- సీఎం ప్రకటనతో అలెర్ట్ అయిన అమాత్యులు
- ఇద్దరు మంత్రులపై వేటు పడనున్నట్లు ప్రచారం
- కొత్తగా మంత్రి పీఠం కోసం ఢిల్లీ స్థాయిలో పైరవీలు
- కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పంతం నెగ్గేనా ?
- ఇప్పటికే తీవ్ర అసంతృప్తితో మునుగోడు ఎమ్మెల్యే
- పలుచోట్ల బహిరంగంగా విమర్శలు
- పనితీరు బాగాలేని మంత్రుల శాఖలలోనూ మార్పు తప్పదా?

(హైదరాబాద్, ఏప్రిల్ 16):

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన మంత్రివర్గ ప్రక్షాళనకు ముహూర్తం ఖరారు చేసినట్లు తెలుస్తోంది. వివిధ రాష్ట్రాల్లో జరుగుతున్న ఎన్నికల తర్వాత రాష్ట్ర క్యాబినెట్ విస్తరణ ఉంటుందని ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా ప్రకటించిన నేపథ్యంలో అటు మంత్రుల్లో, ఇటు ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది. ప్రస్తుతం వివిధ రాష్ట్రాల ఎన్నికల హడావుడి ముగిసిన వెంటనే సీఎం ఢిల్లీ పర్యటనకు వెళ్లి ఏఐసీసీ పెద్దలతో చర్చించి గ్రీన్ సిగ్నల్ తెచ్చుకోనున్నట్లు సమాచారం. ఈ విస్తరణలో కేవలం ఖాళీగా ఉన్న రెండు పదవులను భర్తీ చేయడమే కాకుండా, పనితీరు సరిగ్గా లేని మంత్రులను సాగనంపేందుకు కూడా ముఖ్యమంత్రి గట్టి నిర్ణయంతో ఉన్నట్లు తెలుస్తోంది.

**ఆ ఇద్దరు మంత్రులకు ఉద్వాసన తప్పదా ?**

ముఖ్యంగా ఇద్దరు మంత్రులపై ఈసారి వేటు పడటం ఖాయమని రాజకీయ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. ఉత్తర, దక్షిణ తెలంగాణకు చెందిన ఈ ఇద్దరు మంత్రుల తీరు గత కొంతకాలంగా ప్రభుత్వానికి మైనస్‌గా మారిందనే విమర్శలు ఉన్నాయి. తమ నియోజకవర్గాల్లో వర్గ రాజకీయాలను ప్రోత్సహించడం, ప్రభుత్వంపైనే అనుచిత వ్యాఖ్యలు చేయడం, సొంత నిర్ణయాలను ప్రకటించడం, అధికారులతో బాధ్యతారాహిత్యంగా ప్రవర్తించడం వంటి వాటిపై ఇప్పటికే అధిష్టానం దృష్టి సారించింది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి వెళ్లకుండా, కేవలం తమ వ్యక్తిగత అజెండాలకే ప్రాధాన్యత ఇస్తున్నారనే నివేదికల ఆధారంగా వీరిని తొలగించేందుకు రేవంత్ రెడ్డి మొగ్గు చూపుతున్నట్లు విశ్వసనీయ సమాచారం.

**కొత్తగా పీఠమెక్కే వారెవరో..?**

రాష్ట్ర మంత్రివర్గంలో ఖాళీగా ఉన్న రెండు స్థానాలకు పోటీ బాగానే ఉంది. ఈ జాబితాలో మొదటి రేసులో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. మరోవైపు సీనియారిటీ కోటాలో పి.సుదర్శన్ రెడ్డి, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి మల్ రెడ్డి రంగారెడ్డి తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, లంబాడ సామాజిక వర్గం నుంచి బాలు నాయక్, రామచంద్ర నాయక్ పేరు కూడా వినిపిస్తోంది. మంచిర్యాల నుంచి ప్రేమ్ సాగర్ రావు సైతం మంత్రి పదవి కావాలని కోరుతున్నారు. విజయశాంతి, మధుయాష్కీ గౌడ్ వంటి నేతలు కూడా తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.



**రాజగోపాల్ రెడ్డి పంతం నెగ్గించుకునేనా?**

కాంగ్రెస్ పార్టీలో చేరే సమయంలోనే తనకు మంత్రి పదవి ఇస్తామని అధిష్టానం హామీ ఇచ్చిందని రాజగోపాల్ రెడ్డి బహిరంగంగానే చెబుతున్నారు. పార్టీ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు కావస్తున్నా తనకు ఇంకా అవకాశం రాకపోవడంపై ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఒక సందర్భంలో 'మంత్రిని అవుతాను.. లేదంటే డైరెక్ట్ సీఎంనే అవుతాను' అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా పెద్ద దుమారాన్నే రేపాయి. అంతేకాదు.. పదేపదే వీలు దొరికినప్పుడల్లా ఆయన తన అసంతృప్తిని వెళ్లగక్కుతూనే ఉన్నారు. కాగా రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి దక్కకపోవడానికి ప్రధాన కారణం సామాజిక, ప్రాంతీయ సమీకరణాలు కారణాలని తెలుస్తోంది. ఇప్పటికే ఆయన అన్న కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మంత్రివర్గంలో ఉన్నారు. ఒకే కుటుంబం నుంచి ఇద్దరికి, అలాగే ఉమ్మడి నల్గొండ జిల్లా నుంచి ఇప్పటికే ఉత్తమ్ కుమార్ రెడ్డి, వెంకట్ రెడ్డి వంటి సీనియర్లు ఉండటంతో మూడో వ్యక్తిగా రాజగోపాల్ రెడ్డిని తీసుకోవడం అధిష్టానానికి కొంత ఇబ్బందిగా మారింది. అయితే ఇటీవల టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సైతం రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఇస్తే తప్పేంటనే వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. ఇద్దరు సోదరులు మంత్రివర్గంలో ఉంటే బాగుంటుందన్న అభిప్రాయాన్ని జగ్గారెడ్డి వ్యక్తం చేయడం వెనుక రాజగోపాల్‌రెడ్డి తంత్రం పనిచేస్తుందా అనే సందేహాలు కలుగుతున్నాయి. అయితే రెడ్డి సామాజిక వర్గం కోటా ఇప్పటికే నిండిపోవడం కూడా ఆయనకు ప్రతిబంధకంగా మారింది. ఏది ఏమైనా ఈసారి రాజగోపాల్ రెడ్డి కల నెరవేరుతుందా? లేక ఆయన తిరుగుబాటు అస్త్రం ప్రదర్శిస్తారో చూడాలి

**పలువురి శాఖల మార్పుపై దృష్టి...**

అటు పదవులు దక్కించుకున్నా, తమ శాఖలపై పట్టు సాధించలేక వెనుకబడి ఉన్న మంత్రులకు కూడా ముఖ్యమంత్రి షాక్ ఇవ్వబోతున్నారు. కీలకమైన ఫైళ్లను పరిష్కరించడంలో జాప్యం చేస్తూ, పాలన వేగాన్ని అందుకోలేని వారి శాఖలను మార్చాలని నిర్ణయించారు. దీంతో తమ పదవులకు ఎక్కడ ఎసరు వస్తుందో..? లేక ప్రాధన్యత లేని శాఖ ఎక్కడ కట్టబెడతారోనని మంత్రులు మల్లగుల్లాలు పడుతున్నారు.. కాగా, ఇదే విషయమై తమ అనుచరులతో అత్యంత గోప్యంగా సమాచారం తెప్పించుకుంటున్నట్లు కూడా చర్చ జరుగుతోంది.



# హైదరాబాద్‌లో ప్రోటోల్యాబ్స్ జీసీసీ

- మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్, ఏప్రిల్ 16:

అధునాతన ఇంజనీరింగ్, డిజిటల్ తయారీ సంస్థ ప్రోటోల్యాబ్స్ టెక్నాలజీస్ హైదరాబాద్‌లో గ్లోబల్ సామర్థ్య కేంద్రం (జీసీసీ¾) ఏర్పాటుకు ముందుకొచ్చిందని ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. దీని స్థాపనతో 300మంది ప్రతిభావంతులకు ఉద్యోగావకాశాలు దొరుకుతాయన్నారు. అమెరికాలోని మిన్నెసోటా కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహించే ప్రోటోల్యాబ్స్ స్థానిక ఆరోహన్ గ్లోబల్ కన్సల్టింగ్‌తో కలిసి ఈ జీసీసీని నెలకొల్పుతోంది. ప్రోటోల్యాబ్స్ ప్రతినిధి బృందం సచివాలయంలో శ్రీధర్‌బాబుతో గురువారం భే⃞టీ అయింది. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు తమ విస్తరణ కార్యక్రమాలను వివరించారు. జీసీసీ¾ ఏర్పాటుకు హైదరాబాద్‌ను ఎంపిక చేసుకోవడం పట్ల శ్రీధర్ బాబు హర్షం వ్యక్తం చేసారు. 'గత ఏడాది కాలంలో 80 జీసీసీలు ఇక్కడ ఏర్పాటయ్యాయి.. అత్యాధునిక మౌలిక సదుపాయాలు, చక్కని ఎకో సిస్టం ఉండటం వల్ల వాటిని ఆకర్షించగలుగుతున్నాం.. డిఫెన్స్, ఏరోస్పేస్ పరిశ్రమలకు కూడా తెలంగాణ ముఖ్య కేంద్రంగా అభివృద్ధి చెందుతోంది.. నైపుణ్యం ఉన్న ఇంజనీరింగ్ మానవ వనరులు, పటిష్టమైన డిజిటల్ మౌలిక వ్యవస్థ, పరిశ్రమలకు అనుకూలమైన విధానాలు, వేగంగా విస్తరిస్తున్న తయారీ రంగం, హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి జీసీసీలకు అగ్రగామి గమ్యస్థానంగా తీర్చిదిద్దాయి' అని పేర్కొన్నారు. డిజైన్, ఇంజినీరింగ్, ప్రోటోటైపింగ్, తయారీ రంగాల అభివృద్ధికి తమ ప్రభుత్వం అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించిందని తెలిపారు. ఈ కేంద్రం ద్వారా అధునాతన ఇంజినీరింగ్, డిజిటల్ తయారీ సాంకేతికతలు, ఉత్పత్తి అభివృద్ధి రంగాల్లో విస్తృత కార్యకలాపాలు సాగనున్నాయన్నారు. దీంతో హైదరాబాద్ హై వ్యాల్యూ తయారీ రంగంలో మరింత శక్తివంతంగా ఎదుగుతుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రోటోల్యాబ్స్ రాకతో స్థానిక స్టార్టప్‌లు, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థలు (ఎంఎసఎంఈలు), పెద్ద పరిశ్రమలకు ప్రోటోటైపింగ్ తయారీ సదుపాయాలు స్థానికంగా అందుబాటులోకి వస్తాయని తెలిపారు. కొత్త ఉత్పత్తులను మార్కెట్‌లోకి మరింత వేగంగా తీసుకురావడానికి ఇది దోహదపడుతుందని, చైనాపై ఆధారపడే అవసరం తగ్గిపోతుందని చెప్పారు. ప్రోటోల్యాబ్స్ బృందంలో చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ డాన్ షూమాకర్, చీఫ్ హ్యూమన్ రిసోర్సెస్ ఆఫీసర్ అగ్నెస్ సెమింగ్టన్, చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ మార్క్ కెర్మిష్, ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ ఆశిష్ శర్మలు ఉన్నారు. సమావేశంలో ప్రభుత్వ ఐటీ సలహాదారు సాయికృష్ణ కూడా పాల్గొన్నారు.

# తేజస్వీ, బీజేపీ క్షమాపణ చెప్పాలి



మొదటిపేజీ తరువాయి

ఆ పార్టీ నాయకులు మరోసారి తమ ద్వేషాన్ని వెళ్లగక్కారని, వారికి తెలంగాణ అస్తిత్వంపై గౌరవం లేదని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రం ఏర్పడటాన్ని భారత్‌పాకిస్థాన్ విభజనతో పోల్చడం అత్యంత మూర్ఖత్వమని, ఇలాంటి అహంకారపూరిత, తెలంగాణ వ్యతిరేక వ్యాఖ్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని ఆయన అన్నారు. బీజేపీ నాయకులు పదేపదే తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని, అమరవీరుల త్యాగాలను అవమానించడం అలవాటుగా మార్చుకున్నారని మండిపడ్డారు. ప్రధానమంత్రి మోదీ మొదలుకుని ఈరోజు ఎంపీ తేజస్వి సూర్య వరకు ప్రతి ఒక్కరూ తెలంగాణ వ్యతిరేకతను పదేపదే చాటుకుంటున్నారన్నారు. దీనిని తెలంగాణ సమాజం గుర్తుపెట్టుకుంటుందన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఎవరి దయాదాక్షిణ్యాల వల్లనో, ఎవరి భిక్ష వల్లనో ఏర్పడింది కాదని కేటీఆర్ స్పష్టం చేశారు. దశాబ్దాలపాటు సాగిన పోరాటం, వేలాదిమంది యువకుల బలిదానాల ఫలితంగా ఈ గడ్డ విముక్తి పొందిందని గుర్తు చేశారు. అస్తిత్వం కోసం ప్రజలు చేసిన ప్రజాస్వామ్య బద్ధమైన పోరాటాన్ని దేశ విభజన లాంటి విషాదకర సంఘటనలతో పోల్చడం ద్వారా బీజేపీ తన కుసంస్కారాన్ని బయటపెట్టుకుందని విమర్శించారు. రాష్ట్ర ప్రజల మనోభావాలను దెబ్బతీసే హక్కు ఎవరికీ లేదని ఆయన హెచ్చరించారు. పార్లమెంటు సాక్షిగా తోటి ఎంపీ తెలంగాణపై విషం చిమ్ముతున్నా ఎనిమిదిమంది తెలంగాణ బీజేపీ ఎంపీలు మౌనంగా ఉండటం అత్యంత సిగ్గుచేటని కేటీఆర్ దుయ్యబట్టారు. కనీసం kవష్ట నుంచి ఎన్నికైన కాంగ్రెస్ ఎంపీలు సైతం తేజస్వి సూర్య వ్యాఖ్యలను ఖండించకుండా మౌనంగా ఉండడం దారుణమన్నారు. తమ కళ్ల ముందే తెలంగాణను అవమానిస్తున్నా అడ్డుకోలేకపోయిన వీరు ప్రజలకు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలే ముఖ్యమని భావిస్తున్న ఈ ఎంపీల వైఖరిని సమాజం గమనిస్తోందన్నారు. తెలంగాణను కించపరిచిన తేజస్వి సూర్య తక్షణమే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని తెలంగాణ ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని, బీజేపీ కూడా తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. లేకుంటే తేజస్వి సూర్య వ్యాఖ్యలే బీజేపీ¾ అధికారిక విధానంగా భావించాల్సి వస్తుందన్నారు.

# కౌంటర్ దాఖలు చేయాలి

మొదటిపేజీ తరువాయి

పార్టీ మారలేదని స్పీకర్ ప్రకటించిన 9 మంది ఎమ్మెల్యేలతో పాటు స్పీకర్ కూడా ఈ వ్యవహారంపై వివరణ ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది. తమ వాదనలతో కూడిన కౌంటర్ అఫిడవిట్‌లను దాఖలు చేయాలని స్పష్టం చేసింది. జాబితాలో దానం నాగేందర్, కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాస్ రెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, అరెకపూడి గాంధీ, కాలె యాదయ్య, ప్రకాష్ గౌడ్, గూడెం మహిపాల్ రెడ్డి (సంజయ్), తెల్లం వెంకట్రావు ఉన్నారు.

గతంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఈ ఎమ్మెల్యేలు సాంకేతికంగా పార్టీ మారలేదని, వారు ఇంకా బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నారనే భావన వచ్చేలా స్పీకర్ తీర్పునిచ్చారు. అయితే వారు బహిరంగంగానే కాంగ్రెస్ కండువా కప్పుకున్నారని, ఇది రాజ్యాంగ విరుద్ధమని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హైకోర్టును ఆశ్రయించారు. స్పీకర్ నిర్ణయం ఏకపక్షంగా ఉందని పిటిషనర్లు వాదించారు.

ఈ కేసులో లోతైన విచారణ అవసరమని భావించిన హైకోర్టు తదుపరి విచారణను మే 6కు వాయిదా వేసింది. ఈలోగా ప్రతివాదులందరూ తమ కౌంటర్లను దాఖలు చేయాలని ఆదేశించింది. రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తి రేపుతున్న ఈ కేసులో కోర్టు తీర్పు ఎలా ఉంటుందన్న అంశంపై రాజకీయ వర్గాల్లో చర్చ కొనసాగుతోంది.



చాక్లెట్ కొనిస్తానని..

# యాసిడ్ తాగించింది!

మొదటిపేజీ తరువాయి

దాడికి దారితీశాయి. తన కొడుకును ఇంట్లో నిర్లక్ష్యం చేస్తున్నారనే కక్షతో, తోడికోడలి బిడ్డను అంతం చేయాలనుకున్న ఆ మహిళ క్రూరత్వం స్థానికంగా పెను కలకలం రేపింది.

**జ్యూస్ తాపించి.. చాక్లెట్ ఇస్తానని నమ్మించి..**

పోలీసుల కథనం ప్రకారం.. నిందితురాలు తన తోడికోడలి నాలుగేళ్ల కుమారుడిని లక్ష్యంగా చేసుకుంది. బాలుడికి ఇష్టమైన చాక్లెట్ ఇస్తానని ఆశ చూపించి మభ్యపెట్టింది. 'ఈ జ్యూస్ తాగితే నీకు పెద్ద చాక్లెట్ కొనిస్తాను' అంటూ నమ్మబలికి, గ్లాసులో యాసిడ్ కలిపి తాగించింది. ఏమీ తెలియని ఆ చిన్నారి జ్యూస్ అనుకుని అది తాగడమే ఆలస్యం.. కొద్దిసేపటికే తీవ్ర అస్వస్థతకు గురై విలవిలలాడిపోయాడు. గొంతు, కడుపులో మంటతో చిన్నారి పెట్టిన కేకలు విని తల్లిదండ్రులు పరుగున వచ్చారు.



**ఆసుపత్రిలో మృత్యువుతో పోరాటం**

బాలుడి పరిస్థితి విషమంగా ఉండటాన్ని గమనించిన తల్లిదండ్రులు వెంటనే స్పందించి, సమీపంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. యాసిడ్ ప్రభావం వల్ల బాలుడి అంతర్గత అవయవాలు దెబ్బతినే ప్రమాదం ఉండటంతో, వైద్యులు అత్యవసర చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం చిన్నారి పరిస్థితి నిలకడగా ఉన్నప్పటికీ, వైద్యులు ప్రత్యేక పర్యవేక్షణలో ఉంచి చికిత్స కొనసాగిస్తున్నారు. ఆ పసివాడు పడుతున్న నరకం చూసి ఆసుపత్రి సిబ్బంది సైతం కన్నీరు పెట్టుకుంటున్నారు.

**అసూయే అసలు కారణమా?**

ప్రాథమిక సమాచారం ప్రకారం.. నిందితురాలికి, ఆమె తోడికోడలికి మధ్య గత కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఇంట్లో తన కొడుకు కంటే, తోడికోడలి కొడుకుకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని, అందరూ అతడినే గారబం చేస్తున్నారని నిందితురాలు మనస్తాపానికి గురైంది. ఆ అసూయ కాస్తా ద్వేషంగా మారి, చివరకు ఆ చిన్నారిని లేకుండా చేయాలనే దారుణమైన ఆలోచనకు దారితీసింది. పగ ప్రతీకారాలతో రగిలిపోయిన ఆమె, కన్నబిడ్డ అన్న విచక్షణ కూడా మరచి ఈ ఘాతుకానికి ఒడిగట్టింది.

**కేసు నమోదు చేసిన పోలీసులు**

ఈ ఘటనపై బాధితుడి తల్లి మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చిన్నారిపై జరిగిన అమానుషాన్ని వివరిస్తూ కన్నీరుమున్నీరయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితురాలిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. కుటుంబ సభ్యుల మధ్య ఉన్న చిన్నపాటి మనస్పర్థలు ఇంతటి దారుణానికి దారితీయడం పట్ల పోలీసులు సైతం విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

**స్థానికంగా కలకలం**

ఒకే ఇంట్లో ఉంటూ, సొంత రక్తసంబంధీకుల పిల్లలపైనే ఇలాంటి దాడులకు పాల్పడటం స్థానిక ప్రజలను భయాందోళనలకు గురిచేస్తోంది. కళ్లముందే తిరిగే పసివాడిపై ఇంత కక్ష పెంచుకోవాలా? అంటూ స్థానికులు సదరు మహిళ తీరుపై మండిపడుతున్నారు. ప్రస్తుతం ఈ ఘటన మేడ్చల్ జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది.



## తేజస్వి సభ్యత్వాన్ని రద్దు చేయాలి

హైదరాబాద్, ఏప్రిల్ 16 :

పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో డీలిమిటేషన్‌పై బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలకు రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ కౌంటర్ ఇచ్చారు. తేజస్వి వ్యాఖ్యలు ప్రజాస్వామ్యానికే విఘాతం కలిగించేలా ఉన్నాయని, వాటిని లోక్‌సభ రికార్డుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. అలాగే తేజస్వి లోక్‌సభ సభ్యత్వాన్ని కూడా రద్దు చేయాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. 'తెలంగాణ డీఎన్ఏ ఉన్న ఎవరైనా తేజస్వి వ్యాఖ్యలను ఖండించాలన్నారు. ఈ విషయమై తెలంగాణ బీజేపీ ఎంపీలు ఎందుకు స్పందించడం లేదన్నారు. తేజస్వి సూర్య ఓ తెలివి లేని వ్యక్తి అంటూ విమర్శలు గుప్పించారు. తెలంగాణ ఏర్పాటుపై ఇంత అజ్ఞానంగా మాట్లాడతారా.. రాజ్యాంగ బద్ధంగా ఏర్పాటైన రాష్ట్రాన్నే అవమానిస్తారా అంటూ ఆక్షేపించారు. తేజస్వి రాజ్యాంగాన్ని కించపరిచేలా మాట్లాడారన్నారు.

# పెట్టుబడులు పెట్టేలా ప్రోత్సహించండి

- ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాల్లో రాష్ట్రం అవకాశాల ఖని
- యూఎస్ నేషనల్ కాలేజ్ వార్' ప్రతినిధుల భేటీలో మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, ఏప్రిల్ 16 :

ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాల్లో దేశంలోనే అగ్రగామిగా దూసుకెళ్తున్న తెలంగాణలో పెట్టుబడులు పెట్టేలా అమెరికా పారిశ్రామికవేత్తల్ని ప్రోత్సహించాలని ఆ దేశ ఉన్నతస్థాయి ప్రతినిధి బృందాన్ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో యూఎస్ నేషనల్ కాలేజ్ వార్ బృంద సభ్యులతో ఆయన గురువారం ప్రత్యేకంగా భేటీ అయ్యారు. డ్రోన్లు, కౌంటర్ డ్రోన్ సిస్టమ్స్, ఏరోస్పేస్ కాంపోనెంట్స్, డిఫెన్స్ ఎలక్ట్రానిక్స్, సైబర్ సెక్యూరిటీ, స్పేస్ టెక్నాలజీ, ఏఐ ఇన్ డిఫెన్స్, శాటిలైట్స్ సిస్టమ్స్ అండ్ అడ్వాన్స్‌డ్ కమ్యూనికేషన్స్‌లో రాష్ట్రాన్ని గ్లోబల్ లీడర్‌గా తీర్చిదిద్దేలా తమ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందన్నారు. రాకెట్ల తయారీ నుంచి అత్యాధునిక డ్రోన్ల వరకు, యుద్ధ విమానాల విడిభాగాల నుంచి శాటిలైట్ల వరకు అన్నింటిలోనూ 'మేడిన్ తెలంగాణ' మార్క్ ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తోందన్నారు. ఈ రంగం (ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్)లో తెలంగాణ ఏటా 30 శాతానికి పైగా వృద్ధిని రేటును నమోదు చేస్తోందన్నారు. అలాగే 202426 మధ్య కాలంలో ఎగుమతుల్లో 103 శాతం కాంపౌండ్ యాన్యువల్ గ్రోత్ రేట్ (సీఏజీఆర్) నమోదయిందన్నారు. లాక్హీడ్ మార్టిన్, బోయింగ్, సాఫ్రాన్, ఎయిర్ బస్, దస్సాల్ట్ ఏవియేషన్ తదితర ప్రపంచ దిగ్గజ ఏరోస్పేస్ కంపెనీలతో డీఆర్డీవో, భెల్, మిధాని, బీడీఎల్, ఆర్‌సీఐ, హాల్ తదితర కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలు ఇక్కడ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయన్నారు. ఇవేకాక ప్రిసిషన్ ఇంజనీరింగ్, డ్రోన్లు, డిఫెన్స్ ఎలక్ట్రానిక్స్ రంగాల్లో 1,500 కంటే ఎక్కువ ఎంఎస్ఎంఈలు తెలంగాణ బ్రాండ్‌ను విశ్వవ్యాప్తం చేస్తున్నాయన్నారు. ప్రపంచంలోనే అత్యంత 'కాస్ట్ ఎఫెక్టివ్ ఏరోస్పేస్ సిటీ'గా హైదరాబాద్ మొదటి స్థానంలో నిలిచిందన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వరుసగా ఐదుసార్లు 'బెస్ట్ స్టేట్ ఫర్ ఏరోస్పేస' అవార్డును గెలుచుకుని గ్లోబల్ ఏరోస్పేస్ మ్యాప్‌లో తెలంగాణ ఒక శక్తిమంతమైన కేంద్రంగా మారిందన్నారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ఏరో స్పేస్, డిఫెన్స్, స్పేస్ రంగాలకు అవసరమైన ఎకో సిస్టంను అభివృద్ధి చేస్తున్నామన్నారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ద్వారా ఈ రంగానికి అవసరమైన రెడీ టూ స్కిల్ వర్క్ ఫోర్స్‌ను అందిస్తున్నామన్నారు. పెట్టుబడులకు మాత్రమే కాదు, సాంకేతికత, పరిశోధన, తయారీ, నైపుణ్యాభివృద్ధిలో అమెరికాకు నమ్మకమైన దీర్ఘకాల వ్యూహాత్మక భాగస్వామిగా నిలిచేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. ఏఐ, సైబర్ సెక్యూరిటీ, అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్, స్పేస్ టెక్నాలజీ తదితర రంగాల్లో అమెరికా సంస్థలు, విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలతో కలిసి పని చేస్తామన్నారు. తెలంగాణ లాంటి ప్రగతిశీల రాష్ట్రాలతో కలిసి పని చేసేందుకు సిద్ధంగా ఉన్నామని, రాబోయే రోజుల్లో ఆ దిశగా అడుగులు వేస్తామని స్టేట్ డిపార్ట్‌మెంట్ మినిస్టర్ కౌన్సిలర్ పాల్ నరైన్ పేర్కొన్నారు. అమెరికాతెలంగాణ మధ్య ద్వైపాక్షిక సహకారాన్ని పెంపొందించేందుకు చొరవ చూపుతామన్నారు. కార్యక్రమంలో కెప్టెన్ ఫ్రాంక్ ఒకటా (నేవీ), రెనో బామ్‌ఫోర్డ్ (డిఫెన్స్ సెక్యూరిటీ కోఆపరేషన్ ఏజెన్సీ), లెఫ్టినెంట్ కల్నల్ జాన్ కయాంగ్యాంగ్ (ఆర్మీ), రెబెక్కా కింగ్ (డిఫెన్స్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ), లెఫ్టినెంట్ కల్నల్ మైఖేల్ కూబ్ (ఎయిర్ నేషనల్ గార్డ్), జోస్ సలాన్ (డిఫెన్స్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ ఏజెన్సీ), టీజీఐఐసీ ఎండీ శశాంక, పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి, ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ డైరెక్టర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



# సాకారం కాబోతున్న సాధికారత

- **మహిళా బిల్లుపై బీజేపీ చీఫ్ రామచందర్‌రావు**



**హైదరాబాద్, ఏప్రిల్ 16:**

మహిళల రాజకీయ ను మరింత బలపరిచేందుకు వారికి 2029 నుంచి చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలనే దృఢ సంకల్పంతో చట్ట సవరణను కేంద్రం పార్లమెంటులో ప్రవేశపెట్టిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు తెలిపారు. చందానగర్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ దీంతోపాటు డీలిమిటేషన్ ప్రక్రియను కూడా ముందుకు తీసుకొస్తున్నామన్నారు. ఎన్నో ఏళ్లుగా మహిళలు కలగంటున్న సమాన ప్రాతినిధ్యం ఈ చట్టంతో సాకారం కాబోతోందన్నారు. ఈ చారిత్రక నిర్ణయం సందర్భంగా మహిళల తరపున, ప్రజల తరపున ప్రధాని మోదీకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని, రాష్ట్రంలోని మహిళలందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని అన్నారు. 2008లో మహిళా రిజర్వేషన్ బిల్లును కాంగ్రెస్ పార్టీ తీసుకురావడానికి ప్రయత్నించగా ఆ సమయంలో తన మిత్రపక్షాలైన జనతాదళ్, ఆర్జేడీ, సమాజ్‌వాదీ పార్టీలు పార్లమెంటులో బిల్లు ప్రతులను చింపివేసి ఈ చట్టాన్ని అడ్డుకున్నాయని తెలిపారు. అప్పటి కాంగ్రెస్ నాయకత్వం, ముఖ్యంగా సోనియా గాంధీ స్పష్టమైన వైఖరిని వ్యక్తం చేయలేదని విమర్శించారు. అంతకుముందు రాజీవ్ గాంధీ మహిళా రిజర్వేషన్లు తీసుకొస్తామని హామీ ఇచ్చినా అమలు కాలేదన్నారు. ఈరోజు కాంగ్రెస్ నాయకుల ప్రవర్తనను గమనిస్తే వారు మహిళలకు 33 శాతం రిజర్వేషన్లకు వ్యతిరేకంగా ఉన్నట్టు స్పష్టంగా కనిపిస్తోందని ఆయన విమర్శించారు. కొత్తకొత్త ప్రతిపాదనలతో ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తూ మహిళా రిజర్వేషన్ల అమలును అడ్డుకోవాలనే ఉద్దేశంతో కాంగ్రెస్, ఇండీ అలయెన్స్ పార్టీలు వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోనే ఈ చట్టం సాధ్యమైందని, 2029 నుంచి ఇది అమల్లోకి వస్తే దేశ రాజకీయాల్లో మహిళల పాత్రను విస్తృతంగా పెంచుతుందని చెప్పారు. దేశ జనాభా 140 కోట్లకు చేరిన నేపథ్యంలో సీట్ల సంఖ్యను కూడా సుమారు 50 శాతం మేరకు పెంచే అవకాశం డీలిమిటేషన్ బిల్లు కల్పిస్తోందన్నారు. అందులో 33 శాతం మహిళలకు రిజర్వేషన్ కల్పించడం ద్వారా సరైన ప్రాతినిధ్యం సాధ్యం అవుతుందన్నారు. ఈ చట్టం వల్ల ఏ రాష్ట్రానికో, ఏ ప్రాంతానికో నష్టం జరుగుతుందనే ప్రచారం తప్పు అంటూ కాంగ్రెస్ దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని రామచందర్‌రావు విజ్ఞప్తి చేశారు.

# ప్రజా సంక్షేమమే లక్ష్యం

**హైదరాబాద్, ఏప్రిల్ 16**

తెలంగాణ రాష్ట్రంలో ప్రజల భద్రతను మరింత పటిష్టం చేసేందుకు ప్రభుత్వం కీలక అడుగు వేసింది. భవనాలు బహిరంగ ప్రదేశాలలో అగ్నిప్రమాదాల నివారణకు, ప్రస్తుతమున్న 'ఫైర్ సర్వీసెస్ యాక్ట్, 1999'ను సవరించాలని నిర్ణయించింది. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికతను జోడించి, పకడ్బందీ భద్రతా ప్రమాణాలను అమలు చేయడమే ఈ సవరణల ప్రధాన ఉద్దేశం. ఈ నేపథ్యంలో, ప్రతిపాదిత చట్ట సవరణల ముసాయిదాపై ప్రజల నుండి సలహాలు, సూచనలను ప్రభుత్వం కోరుతోంది. ప్రజాభిప్రాయానికి పెద్దపీట వేస్తూ, అందరి సహకారంతో సురక్షితమైన సమాజాన్ని నిర్మించడమే లక్ష్యంగా ఈ ప్రక్రియను చేపట్టింది.

ఫైర్ సర్వీసెస్ చట్టానికి చేయబోయే మార్పుల వల్ల భవిష్యత్తులో అగ్నిప్రమాదాల తీవ్రతను తగ్గించడమే కాకుండా, విపత్తు నిర్వహణలో వేగవంతమైన స్పందన సాధ్యమవుతుందని అధికారులు భావిస్తున్నారు. ఈ చట్ట సవరణల ముసాయిదా ప్రతిని ప్రభుత్వం అధికారిక వెబ్‌సైట్లలో (fire.telangana.gov.in మరియు telangana.gov.in) అందుబాటులో ఉంచింది. ప్రజలు, భద్రతా నిపుణులు మరియు స్వచ్ఛంద సంస్థలు ఈ ముసాయిదాను పరిశీలించి, తమ విలువైన అభిప్రాయాలను తెలియజేయాలని కోరారు. సూచనలు అందించే వారు వాటి వెనుక ఉన్న సహేతుకమైన కారణాలను కూడా పొందుపరచాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.

తమ సూచనలను సమర్పించాలనుకునే వారు 2026, మే 13వ తేదీ సాయంత్రం 5:00 గంటల లోపు పంపాల్సి ఉంటుంది. ఇందుకుగాను ప్రత్యేక ఈమెయిల్ ఐడిని (actamendfire@telangana.gov.in) ప్రభుత్వం కేటాయించింది. ఈమెయిల్ పంపే వారు సబ్జెక్ట్ లైన్‌లో 'Amendment feedback' అని పేర్కొనాలని సూచించింది. ఇంటర్నెట్ సౌకర్యం లేని వారు పోస్ట్ ద్వారా కూడా తమ లేఖలను పంపవచ్చు. నిపుణుల సలహాలను పరిగణనలోకి తీసుకుని, అత్యున్నత ప్రమాణాలతో కూడిన చట్టాన్ని రూపొందించాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది.

తపాలా ద్వారా పంపే వారు తమ కవరుపై "Suggestions on Amendment to Fire Services Act 1999" అని స్పష్టంగా వ్రాయాలి. లేఖలను డైరెక్టర్ జనరల్, తెలంగాణ ఫైర్, డిజాస్టర్ రెస్పాన్స్, ఎమర్జెన్సీ అండ్ సివిల్ డిఫెన్స్, గచ్చిబౌలి, హైదరాబాద్ 500032 చిరునామాకు పంపాలని అధికారులు తెలిపారు. మరింత సమాచారం లేదా సందేహాల కోసం ప్రజలు 04023442944 లేదా 23442955 నంబర్లను సంప్రదించవచ్చు. ప్రజలు చురుగ్గా పాల్గొని తమ సూచనలు అందించడం ద్వారా సురక్షితమైన తెలంగాణ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ప్రభుత్వం పిలుపునిచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా అగ్నిమాపక సేవల ఆధునీకరణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. హైరైజ్ భవనాల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో, కొత్త చట్టం ద్వారా నిబంధనల ఉల్లంఘనపై కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. అలాగే, విపత్తు సమయాల్లో పౌర రక్షణ విభాగం పాత్రను మరింత బలోపేతం చేసే దిశగా మార్పులు ఉండనున్నాయి. ప్రజల నుండి వచ్చే నిర్మాణాత్మక సలహాలు చట్టాన్ని మరింత పారదర్శకంగా మరియు పకడ్బందీగా మార్చడానికి దోహదపడతాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అగ్నిప్రమాద రహిత రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చేస్తున్న ఈ ప్రయత్నంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

# రాజ్యసభ సభ్యుడిగా వేం నరేందర్ రెడ్డి ప్రమాణ స్వీకారం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 16:**

తెలంగాణ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వేం నరేందర్ రెడ్డి ఈరోజు రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఇటీవల జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో తెలంగాణ నుంచి ఆయన ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం తెలిసిందే. పార్లమెంటు భవనంలో జరిగిన ఈ కార్యక్రమంలో కొత్తగా ఎన్నికైన ఇతర సభ్యులతో పాటు ఆయన కూడా పదవీ స్వీకార ప్రమాణం చేశారు. తెలంగాణ రాజకీయాల్లో కీలక నేతగా ఉన్న నరేందర్ రెడ్డికి జాతీయ స్థాయిలో ప్రాతినిధ్యం వహించే అవకాశం లభించడం పట్ల కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ప్రమాణ స్వీకారం అనంతరం వేం నరేందర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, తనపై నమ్మకంతో రాజ్యసభ ఎంపీగా అవకాశం కల్పించిన కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానానికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యంగా సోనియా గాంధీ, రాహుల్ గాంధీ మరియు మల్లికార్జున ఖర్గేలకు తన కృతజ్ఞతలు తెలియజేశారు. ఒక సాధారణ కార్యకర్త స్థాయి నుంచి రాజ్యసభ వరకు ఎదిగేందుకు సహకరించిన రాష్ట్ర నాయకత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. ఈ బాధ్యతను అత్యంత నిబద్ధతతో నిర్వహిస్తానని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల సమస్యలు, రాష్ట్రానికి రాజ్యాంగబద్ధంగా రావాల్సిన హక్కులు మరియు నిధుల గురించి పార్లమెంటులో గళమెత్తుతానని నరేందర్ రెడ్డి స్పష్టం చేశారు. విభజన చట్టంలోని హామీల అమలు కోసం మరియు రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన కేంద్ర నిధుల సాధన కోసం నిరంతరం పోరాటం చేస్తానని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ప్రజల వికాసం, సంక్షేమం మరియు పారిశ్రామిక అభివృద్ధి కోసం తన శాయశక్తులా కృషి చేస్తానని ఆయన ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. దేశవ్యాప్తంగా తెలంగాణ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇదే కార్యక్రమంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ మరియు తెలంగాణ నుంచి ఎన్నికైన మరో కాంగ్రెస్ ప్రముఖ నాయకుడు, సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ కూడా రాజ్యసభ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. వివిధ రాష్ట్రాల నుంచి ఎన్నికైన కొత్త సభ్యుల రాకతో రాజ్యసభలో కొత్త ఉత్సాహం నెలకొంది.

# లోక్‌సభలో మహిళా బిల్లు, డీ లిమిటేషన్ బిల్లులు

**మొదటిపేజీ తరువాయి**



వోటింగ్ నిర్వహించగా బిల్లును ప్రవేశపెట్టేందుకు మద్దతుగా 251, వ్యతిరేకంగా 185 మంది ఓటు చేశారు. మెజారిటీ సాధించిన అనంతరం మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఈ బిల్లులను లోక్‌సభలో ప్రవేశపెట్టారు. డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు చేసే బిల్లు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో నియోజకవర్గాల పునర్విభజనకు అవకాశం కల్పించే బిల్లులను ఒకేసారి పరిశీలించి, ఆమోదించేలా లోక్‌సభ నిబంధన 66లోని ప్రొవైజోను సస్పెండు చేసి అనుమతించాలని కోరుతూ కేంద్ర మంత్రి మేఘ్‌వాల్ తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ బిల్లులు రాజ్యాంగ సవరణ బిల్లుతో ముడిపడి ఉన్నందున అనుమతించాలని అందులో కోరారు. చర్చకు స్పీకర్ ఓం బిర్లా అనుమతించారు. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు వీటిపై వోటింగ్ నిర్వహించనున్నట్లు సభాపతి తెలిపారు. ఈ మూడింటిలో లోక్‌సభ సీట్లను 550 నుంచి గరిష్ఠంగా 850కి పెంచడంతోపాటు 2011 జనాభా లెక్కల ప్రకారమే దేశంలో డీ లిమిటేషన్ పక్రియ చేపట్టే 131వ రాజ్యాంగ సవరణ బిల్లు, లోక్‌సభ అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజనకు అవసరమైన డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటుకు సంబంధించిన మరో బిల్లు ఉన్నాయి. వీటిని మంత్రి అర్జున్‌రామ్ మేఘtTవాల్ ప్రవేశపెట్టారు. కేంద్ర పాలిత ప్రాంతాల్లో నియోజకవర్గాల పునర్విభజనకు అవకాశం కల్పించే ఇంకో బిల్లును హోంమంత్రి అమిత్ షా సభ ముందుంచారు. వీటిపై సుదీర్ఘంగా చర్చించనున్నారు. రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందాలంటే మూడింట రెండొంతుల మెజారిటీ కావాలి. మిగతా రెండింటికీ సాధారణ మెజారిటీ సరిపోతుంది. ప్రస్తుతం లోక్‌సభలో ఉన్న 540 మంది సభ్యుల్లో 2/3వ వంతు మెజారిటీ అంటే 360 మంది సభ్యుల మద్దతు అవసరం. అధికారిక ఎన్డీయే కూటమికి 292 మంది సభ్యుల మద్దతు ఉంది. బిల్లు ఆమోదానికి మరో 68మంది మద్దతు అవసరం. డీలిమిటేషన్‌ను వ్యతిరేకిస్తున్నామని చెబుతున్న ఇండి కూటమి ఆ బిల్లుకు వ్యతిరేకంగా ఓటేస్తామని చెప్పడంతో రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదంపై ఉత్కంఠ నెలకొంది.

**2024లోనే ఎందుకు అమలు చేయలేదు : కాంగ్రెస్ నేత వేణుగోపాల్ అభ్యంతరం**

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు బిల్లులపై విపక్షాలు తమ అభ్యంతరాలను లేవనెత్తగా వాటిని కేంద్ర హోంమంత్రి అమిత్ షా తోసిపుచ్చారు. 2024లో మహిళా రిజర్వేన్లను ఎందుకు అమలు చేయలేదని లోక్‌సభలో బిల్లులు ప్రవేశపెట్టడానికి ముందు జరిగిన చర్చ సందర్భంగా కాంగ్రెస్ నేత కేసీ వేణుగోపాల్ ప్రశ్నించారు. 2023లోనే ఆ బిల్లుకు సంపూర్ణ మద్దతు ఇచ్చామన్నారు. రాజ్యాంగాన్ని ప్రభుత్వం హైజాక్ చేస్తోందన్నారు. దీనిపై అమిత్‌షా స్పందిస్తూ బిల్లు ప్రవేశపెట్టకుండానే ఎలా ప్రశ్నిస్తారని అసహనం వ్యక్తం చేశారు. బిల్లు సభలో ప్రవేశపెట్టిన తర్వాత సభ్యులు తమ అభిప్రాయాలు చెప్పవచ్చన్నారు. ప్రజల్లో ఆందోళన కలిగించేలా విపక్షాల వ్యాఖ్యలు ఉన్నాయన్నారు. 131వ రాజ్యాంగ సవరణ బిల్లును సమాజ్‌వాదీ, ఎంఐఎం పార్టీలు వ్యతిరేకించాయి. దక్షిణాది ప్రాంతాలకు ప్రాతినిధ్యం లేకుండా ఈ బిల్లు చేస్తుందన్నారు. ఈ సవరణలు రాజ్యాంగ విరుద్ధమని, అవి శాండ్‌విచ్ బిల్లులని డీఎంకే ఆరోపించింది. మహిళా రిజర్వేషన్, రాజ్యాంగ సవరణ బిల్లులపై సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, హోం మంత్రి అమిత్ షాల మధ్య వాడీవేడి చర్చ జరిగింది. ఈ పక్రియను జనగణనతో ప్రారంభించాలని అఖిలేశ్ తొలుత సూచించారు. కులగణనను కేంద్రం పట్టించుకోవట్లేదని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్‌పై కేంద్రం దూకుడులో అర్థం ఏమిటని ప్రశ్నించారు. 'మహిళా రిజర్వేషన్ల అమలుపై కేంద్రం ఎందుకు అంత తొందర ప్రదర్శిస్తోంది.. మొదటగా జనగణనతో ఈ పక్రియను స్టార్ట్ చేయాలి' అని అన్నారు. మహిళా రిజర్వేషన్‌కు తన పార్టీ పూర్తి మద్దతు ఇస్తోందని ఆయన పునరుద్ఘాటించారు. కానీ డీలిమిటేషన్ ద్వారా రిజర్వేషన్ అమలును వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ వాదనపై అమిత్ షా ఘాటుగా స్పందించారు. 'దేశంలో ప్రస్తుతం జనగణన ప్రారంభమైంది.. ఆ తరువాత కుల ఆధారిత సెన్సెస్ కూడా ఉంటుంది.. ప్రస్తుతం గృహ గణన జరుగుతోంది.. ఇళ్లు కులాల వారీగా ఉండవు. కుదిరితే ఇళ్లకు కూడా సమాజ్‌వాదీ పార్టీ కులాన్ని జోడిస్తుంది.. కులగణనతో పాటు జనగణన జరుగుతుందని సభకు హామీ ఇస్తున్నా' అని అమిత్ షా అన్నారు.

# చెరువుల పునరుద్ధరణపై ఫోకస్

- **11 చెరువుల్లో గుర్రపుడెక్క తొలగింపు**
- **దోమల నివారణే లక్ష్యంగా ముమ్మరంగా సాగుతున్న పనులు**
- **మీదికుంట, గోపి చెరువుల్లో గుర్రపుడెక్కను తొలగిస్తున్న సిబ్బంది**

**హైదరాబాద్, ఏప్రిల్ 16**

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని చెరువుల పునరుద్ధరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. నగరంలోని చెరువుల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటు దోమల ఉత్పత్తిని అరికట్టేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా సైబరాబాద్ వ్యాప్తంగా ఉన్న 11 చెరువుల్లో గుర్రపుడెక్క తొలగింపు ప్రక్రియను ముమ్మరం చేశారు. నీటి వనరుల చుట్టూ పేరుకుపోయిన గుర్రపుడెక్క వల్ల నీటి ప్రవాహానికి ఆటంకం కలగడమే కాకుండా, పరిసర ప్రాంతాల్లో దోమల బెడద విపరీతంగా పెరుగుతోందని గుర్తించిన అధికారులు ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం జరుగుతున్న పనులలో భాగంగా శేరిలింగంపల్లి పరిధిలోని మీదికుంట మరియు గోపి చెరువుల్లో గుర్రపుడెక్క తొలగింపు ప్రక్రియ చురుగ్గా సాగుతోంది. ఈ చెరువుల్లో దట్టంగా పెరిగిన గుర్రపుడెక్కను యంత్రాల సహాయంతో క్లియర్ చేస్తున్నారు. దీనివల్ల నీటి ప్రవాహం మెరుగుపడటమే కాకుండా, చెరువుల నిర్వహణ సులభతరం అవుతుందని అధికారులు తెలిపారు. చెరువుల్లో నీరు నిల్వ ఉండి మురుగుగా మారకుండా చూడటం ద్వారా పరిసర కాలనీల ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించడమే తమ ప్రధాన ఉద్దేశమని సైబరాబాద్ మున్సిపల్ అధికారులు పేర్కొన్నారు. నగర జీవవైవిధ్యంలో కీలకమైన ఈ పట్టణ జలవనరులను కాపాడేందుకు నిరంతర పర్యవేక్షణ చేపడుతున్నట్లు అధికారులు వెల్లడించారు. పనులు నిరంతరం కొనసాగేలా మరియు తొలగించిన గుర్రపుడెక్క మళ్లీ పెరగకుండా ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ పునరుద్ధరణ పనుల వల్ల చెరువుల సుందరీకరణతో పాటు భూగర్భ జలాలు కూడా మెరుగుపడే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. పనులు జరుగుతున్న తీరును ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ సిబ్బందికి తగిన సూచనలు జారీ చేస్తున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా ఈ చెరువుల ప్రక్షాళన కార్యక్రమం కొనసాగుతోంది. కేవలం గుర్రపుడెక్క తొలగింపుతోనే ఆగకుండా, చెరువుల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయడం మరియు చెత్తాచెదారం వేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కార్పొరేషన్ యోచిస్తోంది. ప్రజలు కూడా తమ వంతు బాధ్యతగా చెరువుల్లో ప్లాస్టిక్ మరియు ఇతర వ్యర్థాలను వేయకూడదని అధికారులు విజ్ఞప్తి చేశారు. సైబరాబాద్‌ను పరిశుభ్రమైన మరియు ఆరోగ్యకరమైన నగరంగా తీర్చిదిద్దడంలో భాగస్వాములు కావాలని కోరారు. మున్సిపల్ కార్పొరేషన్ చేపట్టిన ఈ చర్యల పట్ల స్థానిక నివాసితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత కొన్నేళ్లుగా గుర్రపుడెక్క సమస్య వల్ల చెరువులు కుచించుకుపోవడమే కాకుండా, దుర్వాసన మరియు దోమలతో ఇబ్బందులు పడ్డామని, తాజా నిర్ణయంతో ఉపశమనం లభిస్తుందని వారు తెలిపారు. సైబరాబాద్ పరిధిలోని మిగిలిన చెరువుల్లో కూడా ఇదే విధంగా పనులు పూర్తి చేసి, పార్కుల్లా అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు. పనుల వేగవంతం కోసం మరిన్ని యంత్రాలను రంగంలోకి దించుతున్నట్లు కార్పొరేషన్ ప్రతినిధులు వెల్లడించారు.

# కలెక్టర్ ముందే మహిళ ఆత్మహత్యాయత్నం

- **మునగాల ప్రజాపాలనలో కలకలం**
- **ఇందిరమ్మ ఇల్లు రాలేదని పురుగుల మందు తాగిన బాధిత మహిళ**
- **కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్, ఎస్పీ నరసింహ సమక్షంలోనే ఘటన**
- **రాజకీయ ఒత్తిళ్లతోనే అన్యాయం జరిగిందని బాధితురాలి ఆవేదన**

**మునగాల (సూర్యాపేట), ఏప్రిల్ 16:**

సూర్యాపేట జిల్లా మునగాల మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' కార్యక్రమం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్, జిల్లా ఎస్పీ నరసింహ ఇతర ఉన్నతాధికారులు ప్రజల సమస్యలను వింటుండగానే, ఒక మహిళ అధికారుల ఎదుటే పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం తీవ్ర కలకలం సృష్టించింది. ప్రభుత్వ పథకాల అమలులో జరుగుతున్న అన్యాయాన్ని భరించలేక, నిరసనగా ఆమె ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ హఠాత్పరిణామంతో ఒక్కసారిగా సభా ప్రాంగణమంతా గందరగోళం నెలకొంది. వివరాల్లోకి వెళితే, మునగాల మండలంలోని తాడ్వాయి గ్రామాన్ని అధికారులు 'ఇందిరమ్మ ఇళ్ల పైలెట్ ప్రాజెక్టు' కింద ఎంపిక చేశారు. ఈ పథకం కింద గ్రామానికి చెందిన సునీత అనే మహిళకు ఇందిరమ్మ ఇల్లు మంజూరైనట్లు ప్రాథమికంగా సమాచారం అందింది. అయితే, అర్హురాలైన తన పేరును తొలగించి, ఆ ఇల్లును మరొకరికి కేటాయించారని సునీత ఆరోపించింది. అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడంతో, నేరుగా జిల్లా కలెక్టర్ పాల్గొన్న సభలోనే తన నిరసనను వ్యక్తం చేస్తూ తనతో తెచ్చుకున్న పురుగుల మందును తాగింది. అధికారుల కళ్ల ముందే ఈ ఘటన జరగడంతో అంతా షాక్‌కు గురయ్యారు. సునీత పురుగుల మందు తాగిన వెంటనే అక్కడున్న పోలీసులు మరియు సిబ్బంది అప్రమత్తమయ్యారు. ఆమెను హుటాహుటిన చికిత్స నిమిత్తం కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమెకు వైద్యులు అత్యవసర చికిత్స అందిస్తున్నారు. కాంగ్రెస్ నాయకులు తమ రాజకీయ అండదండలతో అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందకుండా చేస్తున్నారని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది. తన పేరు మీద వచ్చిన ఇల్లును రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి అధికారులు వేరే వారికి కట్టబెట్టడంపై ఆమె తీవ్రంగా స్పందించింది. ఈ ఘటనపై జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ స్పందిస్తూ, బాధిత మహిళకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో ఎటువంటి అక్రమాలు జరిగాయో విచారణ జరపాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. నిబంధనల ప్రకారం అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందని, ఇటువంటి అఘాయిత్యాలకు పాల్పడవద్దని ఆయన కోరారు. రాజకీయ జోక్యంపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో సమగ్ర నివేదిక కోరుతూ బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన సభలోనే బాధితురాలు ఆత్మహత్యకు యత్నించడం స్థానికంగా పెద్ద చర్చకు దారితీసింది. క్షేత్రస్థాయిలో సంక్షేమ పథకాల అమలులో రాజకీయ పక్షపాతం చూపిస్తున్నారని పలువురు గ్రామస్తులు మండిపడుతున్నారు. నిరుపేదలైన తమకు దక్కాల్సిన ఇళ్లను అక్రమంగా ఇతరులకు ఇస్తున్నారని ఆరోపిస్తూ నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనతో మునగాల మండలంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది, పరిస్థితులను అదుపు చేయడానికి పోలీసులు భారీగా మోహ

# ఢిల్లీలో ముఖ్యమంత్రికి ఘన స్వాగతం

- **పార్లమెంట్ ఆవరణలో సీఎం రేవంత్ రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డిని సన్మానించిన మంత్రి సీతక్క**
- **ముఖ్యమంత్రితో మర్యాదపూర్వక భేటీ**
- **తెలంగాణ అభివృద్ధి ప్రణాళికలపై పార్లమెంట్ ప్రాంగణంలో చర్చలు**
- **రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రంపై ఒత్తిడి తెచ్చే వ్యూహాలపై దిశానిర్దేశం**



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 16**

తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి దేశ రాజధాని ఢిల్లీ పర్యటనలో భాగంగా పార్లమెంట్ ఆవరణను సందర్శించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అలాగే రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకముగా కలిశారు. పార్లమెంట్ ప్రాంగణంలోనే రేవంత్ రెడ్డిని మంత్రి సీతక్క శాలువా కప్పి ఘనంగా సన్మానం చేశారు. ఈ భేటీకి సంబంధించిన వివరాలు సామాజిక మాధ్యమాల్లో అలాగే డిజిటల్ వేదికలపై విస్తృతంగా ప్రచారమవుతున్నాయి. ముఖ్యమంత్రి వెంట ఉన్న కీలక నేతలు ఆయనకు తమ మద్దతును ఈ విధంగా తెలియజేశారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన పర్యటనలో భాగంగా కేంద్ర ప్రభుత్వ పెద్దలతో భేటీ అవుతున్న తరుణంలో ఈ కలయిక ప్రాధాన్యత సంతరించుకుంది. పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో జరిగిన ఈ సమావేశంలో రాష్ట్రానికి సంబంధించిన పెండింగ్ నిధులు, విభజన హామీల అమలు వంటి కీలక అంశాలపై ప్రాథమిక చర్చలు జరిపారు. మంత్రి సీతక్క తన శాఖకు సంబంధించిన నిధుల విడుదల కోరుతూ కేంద్ర మంత్రులను కలిసేందుకు సిద్ధమవుతున్న తరుణంలో ముఖ్యమంత్రి సూచనలు తీసుకున్నారు. ఎంపీ వేం నరేందర్ రెడ్డి కూడా పార్లమెంట్‌లో అనుసరించాల్సిన వ్యూహాలపై ముఖ్యమంత్రితో చర్చలు జరిపినట్లు సమాచారం. ఈ భేటీ ద్వారా తెలంగాణ ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు పక్కా ప్రణాళికతో ఉన్నట్లు స్పష్టమవుతోంది.

రాష్ట్ర అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చేస్తున్న కృషిని మంత్రి సీతక్క కొనియాడారు. ఢిల్లీ స్థాయిలో రాష్ట్ర గళాన్ని బలంగా వినిపించేందుకు రేవంత్ రెడ్డి నిరంతరం శ్రమిస్తున్నారని ఆమె పేర్కొన్నారు. పార్లమెంట్ ఆవరణలో ముఖ్యమంత్రికి లభిస్తున్న గౌరవం తెలంగాణ రాష్ట్ర ప్రతిష్టను పెంచుతోందని అభిప్రాయపడ్డారు. నిరుపేదల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు కేంద్రం నుండి రావాల్సిన వాటాను సాధించేందుకు ఈ పర్యటన దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా తన బృందంతో కలిసి సమన్వయంతో ముందుకు వెళ్లాలని సూచించారు.

ఈ పర్యటనలో భాగంగా పలువురు కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్రానికి రావలసిన బకాయిలను విడుదల చేయాలని కోరే అవకాశం ఉంది. రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి పార్లమెంట్ వేదికగా తెలంగాణ సమస్యలను ప్రస్తావించేందుకు సమాయత్తమవుతున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో గడిపే సమయాన్ని రాష్ట్ర ప్రయోజనాల కోసం పూర్తిస్థాయిలో వినియోగించుకుంటున్నారు. వివిధ శాఖల పెండింగ్ ప్రాజెక్టుల నివేదికలను ఇప్పటికే సిద్ధం చేసి ఉంచారు. మంత్రి సీతక్క కూడా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం అదనపు నిధుల కోరుతూ కేంద్రానికి విన్నవించనున్నారు. ముగింపులో, పార్లమెంట్ ఆవరణలో జరిగిన ఈ సన్మాన కార్యక్రమం తెలంగాణ నేతల మధ్య ఉన్న ఐక్యతను చాటిచెబుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన ఢిల్లీ పర్యటన ద్వారా రాష్ట్రానికి మేలు జరిగేలా గట్టి ప్రయత్నం చేస్తున్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కేంద్రం నుండి సహాయ సహకారాలు పొందేందుకు ఈ చర్చలు కీలకం కానున్నాయి. ఈ పర్యటన ఫలితాలు భవిష్యత్తులో తెలంగాణ అభివృద్ధిపై సానుకూల ప్రభావం చూపుతాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ భేటీకి సంబంధించిన ఫోటోలు ఇప్పటికే ఇంటర్నెట్‌లో అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ప్రభుత్వం తదుపరి కార్యాచరణపై రాష్ట్ర ప్రజల్లో ఆసక్తి నెలకొంది.



## సంపాదకీయం

# చట్టసభలు ఉన్నది కొందరి కోసమేనా?

అంబేద్కర్ మహాశయుడి జయంతి జరుపుకున్న మరుసటి రోజే..పార్లమెంటులో మహిళా బిల్లు, డీలిడిటేషన్ బిల్లులు చర్చకు వచ్చాయి. నిజానికి ఈ విషయంలో పాపం అంబేద్కర్ గారు దూరదృష్టితో ఆలోచించి ఉంటే ఆనాడే ఈ అంశాలు రాజ్యాంగంలో ప్రస్తావనకు వచ్చేవి. కానీ ఆయన అందరినీ నమ్మి ఉంటారు. లేదా ఆయన ఆలోచనలను తొక్కిపెట్టి ఉంటారు. మహిళలకు ఆనాడే రిజర్వేషన్లు ప్రకటించి ఉంటే ఇవాళ ఇంతగా రాద్ధాంతం జరిగేది కాదు. ఇకపోతే బిల్లు ప్రవేశ పెట్టిన సందర్భంలో లోక్‌సభలో కేవలం 333 మంది మాత్రమే హాజరయ్యారు. మిగతా 210 మంది ఏమయ్యారన్నదే ప్రశ్న. చాలా ముఖ్యమైన బిల్లులు ప్రవేశ పెడతారని తెలిసీ ఈ 210 మంది లోక్‌సభకు రాకపోవడం తీవ్ర నేరంగా పరిగణించాలి. డివిజన్ జరిగితే కేవలం 333 మండి మాద్రమే లోక్‌సభలో ఉన్నట్లు లెకక తేలింది. ఇదొక అంశమమైతే.. కొన్ని విషయాలు విన్నప్పుడు తీవ్ర అభ్యంతరం కూడా వ్యక్తం అవుతోంది. ముస్లిం మహిళలకు ప్రత్యేక కోటా ఉండాలని సమాజ్‌వాది పార్టీ డిమాండ్ చేసింది. అంతేగాకుండా ఈ మహిళా బిల్లుకు తొందరెందుకని నిలదీసారు. బిల్లును గతంలోనే ప్రవేశ పెట్టారని, ఇప్పుడు మళ్లీ ప్రవేశ పెట్టడం ఎందుకని కాంగ్రెస్ ఎంపి కెసి వేణుగోపాల్ ప్రశ్నించారు. ఇవన్నీ చూస్తుంటే..అసలు మహిళా బిల్లు పట్ల ఎవరి ఆక్రోశం వారిదే అన్నట్లుగా సభలో వ్యవహారం కనిపించింది. ఇకపోతే పార్లమెంట్ తీరును చూస్తే ఈ బిల్లులపై చర్చ కన్నా, అసలు సభ్యుల ఎంపికపై చర్చ జరగాల్సి ఉంది. కొన్ని పార్టీలు మాఫియాలా తయరయ్యాయా అన్న అనుమానం కలుగుతోంది. పార్లమెంటు, రాష్ట్ర అసెంబ్లీలు వారి గుప్పిట్లోనే ఉంటున్నాయి. కొందరే నిరంతరం ఎంపిలుగా, ఎమ్మెల్యేలుగా ఎన్నికవుతున్నారు. ఇక కుటుంబాలకైతే వేరుగా చెప్పాల్సిన పనిలేదు. ఇలా కొందరి గుప్పిట్లో చట్టసభలు ఉండడం వల్ల చట్టసభల్లో అసవరమైన చర్చలు జరగడం లేదు. ప్రజా సమస్యలు ప్రస్తావనకు రావడం లేదు. లక్షల్లో జీతాలు,విలాసవంతమైన భవనాలు, సెక్యూరిటీ వంటి అదనపు అట్టహాసాలతో వీరే చట్టసభల్లో జీవితాంతం ఊరేగుతున్నారు. కాంగ్రెస్‌లో వారి పరివారమంతా చట్టసభల్లో ఉంది. సోనియా, రాహుల్, ప్రియాంక వంటి వారు ఒకే కుటుంబం నుంచి ఉన్నారు. ఎంఐఎంలో ఓవైసీ నిరంతరాయంగా ఎన్నికవుతున్నారు. అఖిలేశ్ యాదవ్ కటుంబం అటు యూపి అసెంబ్లీ, ఇటు పార్లమెంటులో తిష్ట వేసింది. మోడీ, అమిత్‌షాలు మూడు పర్యాయాలు ఇక్కడే ఉంటున్నారు. రాజ్‌నాథ్ సింగ్, గడ్కరీ ఇలా చెప్పకుంటూ పోతే అన్ని పార్టీలది ఒక్కటే లక్ష్యం. నిరంతరాయంగా చట్టసభల్లో తిష్టవేయడం. ఇలాంటి వారున్నంత కాలం చట్టసభల్లో ప్రజానుకూల చట్టాలు ఎలా వస్తాయి. మహిళల బిల్లు ఎందుకు పాస్ అవుతుంది. మహిళల పట్ల వీరికి ఎందుకు అనుకూలత ఉంటుంది. ఎందుకంటే తమ సీట్లకు ఎసరు వస్తుందేమో అన్న భావనలో అన్ని పార్టీల నేతలు ఉన్నారు. చట్టసభల్లో కొందరే గబ్బిలాల్లా పట్టుకుని వేలాడే పద్ధతి పోవాలి. ఒకరికి రెండు పర్యాయాలు మాత్రమే చట్టసభలో ఉండే అవకాశం ఉండాలి. 140 కోట్ల జనాభా ఉన్న ఈ దేశంలో కొందరే చట్టసభల్లో నిరంతరంగా ఉండిపోయే కాలం పోవాలి. దీనిపై రాజ్యాంగ సవరణ జరగాలి. మోడీకి చిత్తశుద్ధ ఉంటే ఈ రకమైన చట్టసవరణకు పూనుకోవాలి. దీంతో చట్టసభలు ప్రక్షాళన జరుగుతాయి. కొత్తతరం చట్టసభల్లోకి వస్తుంది. మహిళా రిజర్వేషన్లను ముందుకు తీసుకువెళ్లే ముఖ్యమైన బిల్లుపై చర్చించి ఆమోదించేందుకే పార్లమెంటు ప్రత్యేక సమావేశాలను నిర్వహిస్తున్నారు. పనిలోపనిగా డీలిమిటేషన్ పక్రియను ముందస్తుగా అమలు పరచడం అంటే..2029 ఎన్నికల్లో అమలు చేయడం లక్ష్యంగా బిల్లు ప్రవేశ పెట్టారు. డీలిమిటేషన్‌తో దేశవ్యాప్తంగా నియోజకవర్గాల సరిహద్దుల మార్పు జరుగనుంది. సీట్ల సంఖ్య పెరగునంది. 2029 లోక్‌సభ ఎన్నికలలో ఈ పునర్విభజన జరిగేలా చట్టం తీసుకుని వచ్చేందుకు కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం నిర్ణయించింది. రాబోయే సార్వత్రక ఎన్నికల నాటికి 'నారీ శక్తి వందన్ అధినియమ్' అమలును వేగవంతం చేసేందుకు ఉద్దేశించిన ఒక ముఖ్యమైన రాజ్యాంగ సవరణ బిల్లును ఆమోదించే లక్ష్యంతో మూడు రోజుల పాటు పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ప్రారంభం అయ్యాయి. నిజానికి యూపిఎ పదేళ్ల కాలంలో మహిళా బిల్లును అటకెక్కించారు. కానీ వారు ఇప్పుడు మోడీ ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. గతంలోనే ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నిస్తున్నారు. నిజంగానే గత ఎన్నికల్లోనే ఈ చట్టం అమలు చేసి ఉంటే పేచీ వచ్చేది కాదు. కానీ మోడీ ప్రభుత్వం తన రాజకీయాలను తాను ప్రదర్శిస్తోంది. నియోజకవర్గాల పునర్విభజనను 2029 సార్వత్రక ఎన్నికలలోగానే పూర్తి చేసేందుకే చట్టసభలలో మహిళల ప్రాతినిధ్యాన్ని పెంపుదలకు మోదీ ప్రభుత్వం పూనుకున్నది. 2011 జనాభా గణన ఆధారంగా డీలిమిటేషన్ అమలును ఈ మహిళా రిజర్వేషన్‌తో ముడిపెట్టారు. లోక్‌సభ సభ్యుల సంఖ్యను 543 నుంచి 816కు పెంచడం ద్వారా ప్రస్తుతం పురుషులు కలిగివున్న మొత్తం సీట్ల సంఖ్యను తగ్గించకుండానే 33 శాతం, అంటే ఇంచుమించు 273 సీట్లను మహిళలకు రిజర్వ్ చేసేందుకు నియోజకవర్గాల పునర్విభజన తప్పనిసరి చేసేలా చట్టసవరణకు పూనుకున్నారు. అంటే మోడీ కూడా రాజకీయ ఎత్తుగడలతోనే ఉన్నారు. ఇలా చేయడం వల్ల పాతవారే ఎన్నికవుతారు. అలాగే కొందరి నియోజకవర్గాలు గల్లంతవుతాయి. అయితే మహిళలకు ఎప్పుడో చట్టసభల్లో ప్రాతినిధ్యం దక్కాల్సి ఉంది. మహిళలు అభివృద్ధి సాధించినప్పుడే సమాజం పురోగమిస్తుందనే మన చిరకాల నాగరికతా స్ఫూర్తికి ఇది నిదర్శనంగా నిలుస్తుంది. మహిళలకు రిజర్వేషన్లు కల్పించే ఈ సందర్భం మన రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణమైనది. చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగాలన్న అంశంలో మాత్రం అందరికీ ఏకాభిప్రాయం ఉన్నా, డీ లిమిటేషన్‌తో ముడిపెట్టడాన్ని సభలో సభ్యులు వ్యతిరేకిస్తున్నారు. అయితే అలా చేయకుంటే ఇప్పుడున్న సీట్లతోనే మహిళలకు సీట్లు సర్దుబాటు చేయడానికి ఏ రాజకీయ పార్టీ సిద్దంగా లేదు. ఇదంతా ఒక ఎత్తయితే చట్టసభలో సభ్యుల పదవీకాలాన్ని నిర్దేశించాలి. ఎన్ని పర్యాయాలు ఎంపిలుగా ఉండాలో, ఎమ్మెల్యేలుగా ఉండాలో నిర్ణయించాలి. కొందరే నిరంతరాయంగా చట్టసభలకు పరిమితం అయ్యే విధానం పోవాలి. ఇది జరిగితే తప్ప భారతప్రజాస్వామ్యానికి అర్థం లేదు.

# మహిళా బిల్లుతో చరిత్ర సృష్టిద్దాం

- ఇందులో ఎలాంటి రాజకీయం లేదు
- 30 ఏళ్లుగా మహిళలు ఎదురు చూస్తున్నారు
- వారికి అవకాశం ఇవ్వడం మన బాధ్యత
- చట్టసభల్లోనూ వారి సత్తా చాటేలా చేద్దాం
- ఈ బిల్లు ఆమోదంలో నాకు క్రెడిట్ వద్దు
- ఆమోదించే విపక్షాలకే దక్కుతుంది
- విస్మరించే వారిని మహిళలు క్షమించరు
- ఉత్తరాది, దక్షిణ్యాది అంటూ విభజన తేవద్దు
- డీలిమిటేషన్‌తో దక్షిణాదికి ఎలాంటి అన్యాయం జరగదు
- మహిళా బిల్లుపై పార్లమెంటులో ప్రధాని మోడీ ప్రసంగం



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 16:** మహిళా రిజర్వేషన్ బిల్లును రాజకీయ కోణంలో చూడవద్దు అని ప్రధాని మోదీ అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ఏ పార్టీకి అనుకూలం కాదు అన్నారు. దానికి రాజకీయ రంగు పూయవద్దు అన్నారు. ఎవరు బాధ్యులైనా, ఇప్పటికే మహిళా రిజర్వేషన్ బిల్లును ఆలస్యం చేశామన్నారు. ఈ బిల్లులను తీసుకువచ్చిన సక్సెస్ ట్రెజరీ బెంచ్‌లకు కానీ, మోదీకి కానీ దక్కదని, ఇది భారత ప్రజాస్వామ్యానికి దక్కుతుందని ఆయన అన్నారు. లోక్‌సభలో డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లులను ప్రవేశపెట్టిన నేపథ్యంలో ప్రధాని మోదీ ప్రసంగించారు. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ప్రవేశపెట్టిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లుపై ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా రిజర్వేషన్ బిల్లు అంశంలో క్రెడిట్ ఎవరిదన్న దానిపై ఆలోచించరాదు అన్నారు. కావాలంటే మీరు క్రెడిట్ తీసుకోవచ్చు అని ఆయన ప్రతిపక్షాలకు చెప్పారు. ముందుగా 33 శాతం మంది మహిళలు ఇక్కడకు రావాలన్నారు. భారతీయ సోదరీమణులను నమ్మండి అని, వారి ఇంటెలిజెన్స్‌ను గుర్తించాలన్నారు. నారీ శక్తి వికసిత్ భారత్‌కు ఉపయోపడుతుందన్నారు. మనం తీసుకోబోయే నిర్ణయాన్ని మహిళలు వీక్షిస్తున్నారని, మన ఉద్దేశాలను కూడా గమనిస్తున్నారన్నారు.మహిళా రిజర్వేషన్ పక్రియను మరింత ఆలస్యం చేయవద్దు అన్నారు. రాజ్యాంగ సవరణ బిల్లులతో ఏ రాష్ట్రానికి అన్యాయం జరగదు అని, ఎవర్నీ వివక్షపూరితంగా చూడబోమన్నారు. అలాగే దక్షిణాదికి అన్యాయం అంటున్న వాదనలో కూడా వాస్తవం లేదన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు విషయంలో తనకు క్రెడిట్ అవసరం లేదని మోదీ అన్నారు. ఒకవేళ బిల్లు పాసైన తర్వాత.. ఎవరైనా కావాలంటే వారి పేరు, ఫోటో మీద ఫుల్ పేజీ యాడ్ ఇవ్వనున్నట్లు చెప్పారు. మహిళా రిజర్వేషన్ బిల్లును అందరి అచీవ్‌మెంట్‌గా చూడాలన్నారు. ఇది ఏ ఒక్క వ్యక్తి, లేదా రాజకీయ పార్టీకి చెందిన సక్సెస్ కాదన్నారు. కానీ ఒకవేళ మూడు దశాబ్దాల తర్వాత కూడా ఈ సంస్కరణ చేపట్టకపోతే, అప్పుడు ఆ లబ్ది ఏ పార్టీకి దక్కదని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును వ్యతిరేకించేవారు భవిష్యత్తులో భారీ మూల్యం చెల్లించుకుంటారన్నారు. డీలిమిటేషన్ అంశంలో గ్యారెంటీ ఇవ్వనున్నట్లు ప్రధాని తెలిపారు. గ్యారెంటీ, ప్రామిస్ పదాలు వాడమంటే వాడుతానని, ఒకవేళ తమిళంలో దీనికి తగిన పదం ఏదైనా ఉందంటే దాన్ని కూడా చెబుతానని, మన ఉద్దేశం స్వచ్ఛమైందైతే, అప్పుడు పదాలతో ఆడాల్సిన అవసరం ఉండదని ఆయన అన్నారు. దేశ చరిత్రలో ఇదో కీలక ఘట్టమని ఈ సందర్భంగా మోదీ వ్యాఖ్యానించారు. కాలానుగుణంగా మనం కూడా మారాలన్నారు. వాస్తవానికి ఈ బిల్లును 30 ఏళ్ల క్రితమే ఆమోదించాల్సిందని చెప్పుకొచ్చిన ఆయన.. ఇది దేశ చరిత్రలోనే గొప్ప బిల్లు అని అభిప్రాయపడ్డారు. ఈ బిల్లును ఆమోదించడం ప్రస్తుత పార్లమెంట్‌కు ఓ కీలక సువర్ణావకాశమని ఈ సందర్భంగా మోదీ పేర్కొన్నారు. 'దేశానికి సరికొత్త దిశను సూచించే ప్రయత్నం చేస్తున్నాం. దేశంలోని సగం జనాభాకు అధికారం ఇవ్వడం అద్భుత ఘట్టం. వికసిత్ భారత్ అంటే మౌలిక వసతుల కల్పనే కాదు.. మహిళలకు అధికారం ఇవ్వడం కూడా. వికసిత్ భారత్‌లో మహిళల భాగస్వామ్యమే లక్ష్యం. మహిళలకు అధికారమిస్తే దేశానికి సరికొత్త మార్గం చూపిస్తారు. మహిళలకు నిర్ణయాధికారం ఇవ్వడమే మా లక్ష్యం. ఇందులో ఎలాంటి రాజకీయ ప్రయోజనాలు లేవు. ఈ విషయంలో విపక్షాలను మహిళలు ఎప్పటికీ క్షమించరు' అని ప్రధాని చెప్పుకొచ్చారు. పంచాయతీల్లో రిజర్వేషన్లకు అందరూ అంగీకరించారు. లోక్‌సభలో మాత్రం బిల్లును అడ్డుకుంటున్నారు. ఈ బిల్లుకు మద్దతిచ్చే రాజకీయ పార్టీలకే మనుగడ ఉంటుంది. 30 ఏళ్లలో ఇదే అంశం రుజువైంది. మహిళల్లో రాజకీయ చైతన్యం పెరిగింది. అత్యున్నత చట్టసభల్లోనూ భాగస్వామ్యం కోరుతున్నారు. చీపురు పనికాదు.. పార్లమెంట్‌లో సీట్లు అడుగుతున్నారు. ఇప్పుడు బిల్లును వ్యతిరేకించిన వారిని మహిళలే శిక్షిస్తారు' అని మోదీ పేర్కొన్నారు. ప్రస్తుతానికి 33 శాతం రిజర్వేషన్లు అమలుచేయని వ్వండని.. ఆ తర్వాత ఓబీసీ, ఇతర వర్గాల కోటాపై ఆలోచిద్దామని పార్లమెంట్ వేదికగా మోదీ కోరారు. 'పార్లమెంట్‌పై నాకు నమ్మకం ఉంది. అత్యంత వెనుకబడిన వర్గానికి చెందిన నాకు ప్రధాని పదవి దక్కింది. తప్పకుండా ఓబీసీలకు న్యాయం చేస్తాం. మహిళా రిజర్వేషన్‌కు రాజకీయ రంగు పులమొద్దు. ఈ బిల్లు రాజకీయ పార్టీల కోసం కాదు.. మహిళల కోసమే అంటూ.. రిజర్వేషన్లు మహిళల హక్కు. 2029లో రిజర్వేషన్లు అమలు చేయకపోతే మహిళలకు అన్యాయం జరిగినట్టవుతుంది. వికసిత్ భారత్ సాధనలో మహిళలదే కీలక పాత్ర. ఇప్పటికైనా మహిళా రిజర్వేషన్ ఆలస్యం కాకూడదు. దీనికి అన్ని పార్టీలు మద్దతు ఇవ్వాలి' అని ప్రధాని పిలుపునిచ్చారు. 'దేశమంతా ఒక్కటే.. ప్రాంతీయ భేదాలు ఉండకూడదు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు అన్ని ప్రాంతాలూ సమానమే. ఉత్తర భారతం, దక్షిణ భారతం అనే తేడా మాకు లేదు. చిన్న రాష్ట్రాలకు ఎలాంటి అన్యాయం జరగదు. దేశాన్ని ముక్కలు చేసే అధికారం మనకు లేదు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై నాకు ఎలాంటి క్రెడిట్ అవసరం లేదు. అన్ని పార్టీలకు ధన్యవాదాలు తెలుపుతూ శుక్రవారం ప్రకటన చేస్తా. నా స్వార్థం కోసం బిల్లు అంటూ తప్పుడు ప్రచారం చేయవద్దు' అని మోదీ తన ప్రసంగంలో వివరించారు. ఈ బిల్లులతో దేశానికి సరికొత్త దశ, దిశను ఇస్తున్నాం. వికసిత్ భారత్ అంటే రోడ్లు, రైళ్లు, మౌలిక సదుపాయాలు మాత్రమే కాదు. మహిళల స్వావలంబన కూడా ఉంటేనే అది సంపూర్ణ వికసిత్ భారత్ అవుతుంది. దేశ రాజకీయాల్లో, వికసిత్ భారత్ సాధనలో మహిళల పాత్ర కీలకం. మహిళలకు అవకాశమిస్తే దేశానికి సరికొత్త మార్గం చూపిస్తారు. రాజకీయాల్లో తమ శక్తిని చాటేందుకు మహిళలు సిద్ధంగా ఉన్నారు. ఎవరికైనా అవకాశమిస్తేనే కదా.. వారి సామర్థ్యం తెలుస్తుంది. రాజకీయాల్లో సామర్థ్యం, అనుభవం ఉన్న మహిళలు పుష్కలంగా ఉన్నారు. దేశ ప్రగతిలో మహిళలకూ భాగస్వామ్యం కల్పించాల్సిందే. చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు.. మహిళలకు మనం ఇస్తున్న కానుక కాదు. అది వారి హక్కు అని మోదీ వ్యాఖ్యానించారు. 2024 ఎన్నికల్లో వీటిని అమలు చేద్దామని మేం ప్రయత్నించినా సాధ్యం కాలేదు. 2029 ఎన్నికల్లోనూ రిజర్వేషన్లు ఇవ్వకపోతే మహిళలకు అన్యాయం చేసినట్లేనని అన్నారు. బిల్లును తీసుకురాగానే కొందరు విభజన రాజకీయాలు చేస్తున్నారు. ఉత్తరాది, దక్షిణాది అంటూ మాట్లాడుతున్నారు. అలాంటి వారిని ప్రజలు ఇప్పటికే దూరం పెట్టారు. డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి నష్టం జరగదు. చిన్న రాష్ట్రం, పెద్ద రాష్ట్రం, ఉత్తరాది, దక్షిణాది అనే భేదభావం మాకు లేదు. ఏ ప్రాంతానికీ అన్యాయం జరగదని హామీ ఇస్తున్నాం అని మోదీ స్పష్టం చేశారు.

# 2024లోనే ఎందుకు అమలు చేయలేదు

- కాంగ్రెస్ నేత కేసీ వేణుగోపాల్ అభ్యంతరం
- కులగణన లేకుండా చేపట్టడంలో తొందరెందుకున్న అఖిలేశ్
- విపక్షాల అభ్యంతరాలను తోసిపుచ్చిన అమిత్ షా

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 16:** చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లకు తుది రూపం ఇచ్చేందుకు, డీలిమిటేషన్ ద్వారా నియోజకవర్గాలను పెంచేందుకు, పునర్విభజించేందుకు కేంద్ర ప్రభుత్వం 3 బిల్లులను లోక్‌సభ ముందుకు తీసుకొచ్చింది. ఈ సందర్భంగా విపక్షాలు తమ అభ్యంతరాలను లేవనెత్తగా.. వాటిని కేంద్ర హోంమంత్రి అమిత్ షా తోసిపుచ్చారు. 2024లో మహిళా రిజర్వేన్లను ఎందుకు అమలు చేయలేదని లోక్‌సభలో బిల్లులు ప్రవేశపెట్టడానికి ముందు జరిగిన చర్చ సందర్భంగా కాంగ్రెస్ నేత కేసీ వేణుగోపాల్ ప్రశ్నించారు. 2023లోనే ఆ బిల్లుకు సంపూర్ణ మద్దతు ఇచ్చామన్నారు. రాజ్యాంగాన్ని ప్రభుత్వం హైజాక్ చేస్తోందన్నారు. దీనిపై అమిత్‌షా స్పందిస్తూ.. బిల్లు ప్రవేశపెట్టకుండానే ఎలా ప్రశ్నిస్తారని అసహనం వ్యక్తంచేశారు. బిల్లు సభలో ప్రవేశపెట్టిన తర్వాత సభ్యులు తమ అభిప్రాయాలు చెప్పవచ్చన్నారు. ప్రజల్లో ఆందోళన కలిగించేలా విపక్షాల వ్యాఖ్యలు ఉన్నాయని, జనగణన ఎందుకు చేపట్టలేదని అఖిలేశ్ ప్రశ్నిస్తున్నారు. ఆ పక్రియ ఇప్పటికే మొదలైందన్న విషయం గుర్తించాలి. ప్రస్తుతం ఇళ్ల గణన జరుగుతోంది. ఇళ్లకు ఎలాంటి జాతి ఉండదు. సమాజ్‌వాదీ పార్టీ ఇళ్లకు కూడా జాతిని ఆపాదిస్తోంది. వ్యక్తుల జనగణన జరిగిన సమయంలోనే జాతి ప్రస్తావన ఉంటుందని కేంద్ర మంత్రి కౌంటర్ ఇచ్చారు. 131వ రాజ్యాంగ సవరణ బిల్లును సమాజ్‌వాదీ, ఎంఐఎం పార్టీలు వ్యతిరేకించాయి. దక్షిణాది ప్రాంతాలకు ప్రాతినిధ్యం లేకుండా ఈ బిల్లు చేస్తుందన్నారు. ఈ సవరణలు రాజ్యాంగ విరుద్ధమని, అవి శాండ్‌విచ్ బిల్లులని డీఎంకే ఆరోపించింది. మహిళా రిజర్వేషన్, రాజ్యాంగ సవరణ బిల్లులపై లోక్‌సభలో సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, హోం మంత్రి అమిత్ షాల మధ్య వాడీవేడి చర్చ జరిగింది. ఈ పక్రియను జనగణనతో ప్రారంభించాలని అఖిలేశ్ యాదవ్ తొలుత సూచించారు. కులగణనను కేంద్రం పట్టించుకోవట్లేదని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్‌పై కేంద్రం దూకుడులో అర్థం ఏమిటని ప్రశ్నించారు. 'మహిళా రిజర్వేషన్ల అమలుపై కేంద్రం ఎందుకు అంత తొందర ప్రదర్శిస్తోంది. మొదటగా జనగణనతో ఈ పక్రియను స్టార్ట్ చేయాలి' అని ఆయన అన్నారు. మహిళా రిజర్వేషన్‌కు తన పార్టీ పూర్తి మద్దతు ఇస్తోందని ఆయన పునరుద్ఘాటించారు. కానీ డీలిమిటేషన్ ద్వారా రిజర్వేషన్ అమలును వ్యతిరేకిస్తున్నామని అన్నారు.



ఈ వాదనపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఘాటుగా స్పందించారు. 'దేశంలో ప్రస్తుతం జనగణన ప్రారంభమైంది. ఆ తరువాత కుల ఆధారిత సెన్సెస్ కూడా ఉంటుంది. ప్రస్తుతం గృహ గణన జరుగుతోంది. ఇళ్లు కులాల వారీగా ఉండవు. కుదిరితే ఇళ్లకు కూడా సమాజ్‌వాదీ పార్టీ కులాన్ని జోడిస్తుంది. కులగణనతో పాటు జనగణన జరుగుతుందని నేను సభకు హామీ ఇస్తున్నాను' అని హోం మంత్రి అమిత్ షా అన్నారు.

# మా వైఖరి మారదు..

## సోనియా గాంధీ స్పష్టం!



**న్యూఢిల్లీ :** పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) బిల్లులపై కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీ స్పందించారు. ఈ బిల్లుల విషయంలో తమ పార్టీ నిర్ణయం ఏమిటో ఇప్పటికే స్పష్టంగా చెప్పామని, తాజాగా అదనంగా వివరించాల్సింది ఏమీ లేదని ఆమె మీడియాకు తెలిపారు. మహిళా బిల్లును సమర్థిస్తూనే, దానిని డీలిమిటేషన్‌తో ముడిపెట్టడాన్ని కాంగ్రెస్ వ్యతిరేకిస్తున్న విషయం తెలిసిందే. ఇదే విషయాన్ని ఆమె పరోక్షంగా పునరుద్ఘాటించారు. లోక్‌సభలో కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ మేఘ్‌వాల్ 131వ రాజ్యాంగ సవరణ బిల్లుతో పాటు డీలిమిటేషన్ బిల్లును ప్రవేశపెట్టారు. అదేవిధంగా కేంద్రపాలిత ప్రాంతాలకు సంబంధించిన నియోజకవర్గాల బిల్లును కేంద్ర హోం మంత్రి అమిత్ షా సభ ముందు ఉంచారు. ఈ బిల్లులను సభలో చర్చకు అనుమతించాలా వద్దా అనే అంశంపై ప్రాథమిక ఓటింగ్ జరగ్గా, మెజారిటీ సభ్యులు అనుకూలంగా ఓటు వేశారు. దీంతో బిల్లులపై సమగ్ర చర్చకు మార్గం సుగమమైంది. బిల్లులను అనుమతించాలా? వద్దా? అన్న అంశంపై ఓటింగ్ జరగ్గా మెజారిటీ సభ్యులు అనుకూలంగా ఓటు వేశారు. ఈ బిల్లులపై 12 గంటల పాటు చర్చ జరగనుంది. అవసరమైతే సమయాన్ని స్పీకర్ పొడిగిస్తారని కేంద్రం పేర్కొంది. రేపు సాయంత్రం 4 గంటలకు ఓటింగ్ జరిగే అవకాశం ఉంది.

# ముస్లిం ప్రాతినిధ్యాన్ని తుడిచిపెట్టే బిల్లు

## మహిళా బిల్లుపై ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ అక్కసు



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 16:** పార్లమెంట్ సమావేశాల్లో మూడు కీలక బిల్లులను ప్రవేశపెట్టారు. మహిళా రిజర్వేషన్ బిల్లు, నియోజకవర్గ పునర్విభజన బిల్లుపై కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ చర్చను ప్రారంభించారు. అయితే.. మహిళా రిజర్వేషన్ బిల్లుపై ఏఐఎంఐఎం చీఫ్, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ వ్యతిరేకించారు. మహిళా బిల్లుకు నిరసనగా సాహిర్ లుధియాన్వి రాసిన ఓ కవితను లోక్‌సభా ముఖంగా చదివి వ్యతిరేకించారు. ఈ బిల్లు సమాఖ్య వాద ఉల్లంఘన కిందకు వస్తుందని అసదుద్దీన్ ఒవైసీ పేర్కొంటూ.. దీనిని సభలో ప్రవేశపెట్టడాన్ని తాను పూర్తిగా వ్యతిరేకిస్తున్నానని అన్నారు. ఈ చర్చ మహిళా రిజర్వేషన్‌కు సంబంధించినది కాదని, ఇది ముస్లిం ప్రాతినిధ్యాన్ని తుడిచివేసే చర్య అని ఆయన అభిప్రాయపడ్డారు. జనాభా ఎక్కువగా ఉన్న రాష్ట్రాలకు ఈ బిల్లు మరింత అధికారాన్ని ఇస్తుందని, పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని అరికడుతుందని ఒవైసీ వాదించారు.



## సంక్షేమ పథకాలపై అవగాహన సదస్సు



**రామారెడ్డి రాజముద్ర న్యూస్:** రామారెడ్డి మండల కేంద్రంలో ముదిరాజ్ కళ్యాణ మండపం నందు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న చేపట్టబోయే సంక్షేమ కార్యక్రమాలు అనగా రైతు భరోసా, సన్న రకం దాన్యం పండించే రైతులకు రూపాయలు 500 బోనస్ క్వింటాల్కు, ఇందిరమ్మ ఇల్లు, చేయూత పెన్షన్లు, నూతన రేషన్ కార్డులు, మహాలక్ష్మి పథకం ద్వారా రూపాయిలు, 500 కే గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి, మహిళా సాధికారతకు బ్యాంకు లింకేజీ రుణాలు, వడ్డీ లేని రుణాలు, ఇందిరమ్మ చీరల పంపిణీ, త్వరలో చేపట్టబోయే ఫ్రీ ప్రైమరీ స్కూల్ నుండి ఇంటర్మీడియట్ వరకు అల్పాహారం, మధ్యాహ్న భోజన పథకం అమలు , పోషణ మాసం సందర్భంగా అంగన్వాడీ టీచర్లు పోషక ఆహారాలు తీసుకొచ్చి వాటి పోషక విలువలను తెలియజేశారు,ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ఇంటర్మీడియట్ చదివే దివ్యాంగులకు వాహనాల పంపిణీ ప్రకృతి వ్యవసాయం పంట మార్పిడి మొదలైన విషయాల పట్ల ప్రజాప్రతినిధులకు, రైతులకు, యువకులకు స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఎన్జీవోలకు ఆయా శాఖల అధికారులు అవగాహన కల్పించారు . ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ విజయ్ పాల్ రెడ్డి, ఎంపీడీవో నాగేశ్వర్ గుప్తా, తాసిల్దార్ సుమలత, ఎంఈఓ ఆనంద్ రావు, వ్యవసాయ శాఖ అధికారి భాను శ్రీ,, వైద్య అధికారి డాక్టర్ సురేష్, ఐకెపి ఎపిఎం పద్మావతి, ఎంపీ ఓ తిరుపతిరెడ్డి, ఏపీవో ధర్మారెడ్డి, గ్రామ సర్పంచ్ బండి ప్రవీణ్, అన్ని శాఖల అధికారులు అన్ని గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డ్ మెంబర్లు, అంగన్వాడి సూపర్వైజర్ జ్యోతి, అంగన్వాడీ టీచర్లు, వైద్య సిబ్బంది, ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు, మహిళలు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుంది

### మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్




**మేడ్చల్, రాజముద్ర న్యూస్:** జర్నలిస్టులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ పేర్కొన్నారు. గురువారం డిసిసి అధ్యక్షుడిని సన్మానించిన అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి షామీర్పేట డివిజన్ అంతయిపల్లి లోని ఎస్ఎన్ఆర్ ఫంక్షన్ హాల్ లో జరిగిన టియుడబ్ల్యూజే రాష్ట్రస్థాయి కార్యవర్గ సమావేశానికి డిసిసి అధ్యక్షుడు తోటకూర వజ్రెష్ యాదవ్ విచ్చేశారు. ఈ సందర్భంగా డిసిసి అధ్యక్షుడు తోటకూర వజ్రెష్ యాదవ్, జిల్లా ఆర్టిఏ మెంబర్ జయపాల్ రెడ్డి, అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కమటం శిరీష కృష్ణారెడ్డి, మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహులు యాదవ్, అలియాబాద్ కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు తుంకి రమేష్ లను మేడ్చల్ జిల్లా యూనియన్ అధ్యక్షుడు, కార్యదర్శి బాలరాజు, వెంకట్రాంరెడ్డిల ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర అకాడమీ చైర్మన్ కె శ్రీనివాస్ రెడ్డి శాలువా కప్పి ఘనంగా మెమెంట్లతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులకు అండగా ఉంటానని అన్నారు. జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు విరహత్ అలీ, జిల్లా ఆర్టిఏ నెంబర్ జైపాల్ రెడ్డి, మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నరసింహ యాదవ్, అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కంటం శిరీష కృష్ణారెడ్డి,మూడు చింతల పల్లి మున్సిపల్ చైర్మన్ జాము రవి, అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుంకి రమేష్, గుల్లపోచంపల్లి కాంగ్రెస్ అధ్యక్షుడు సాయి పేట శ్రీనివాస్, జర్నలిస్టులు పాల్గొన్నారు.

## పోషక వారోత్సవాలు



**రామారెడ్డి రాజముద్ర న్యూస్:** రామారెడ్డి మండల కేంద్రంలో ముదిరాజ్ కళ్యాణ మండపంలో నందు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ కార్యక్రమంలో భాగంగా అంగన్వాడి టీచర్లు పోషక ఆహారాలను తీసుకువచ్చి వాటి పోషక విలువలను వివరించారు, బయట ఆహారం తినకుండా ఇంటిలో వాడిని ఆహారం తీసుకోవాలని అంగన్వాడి సూపర్వైజర్ జ్యోతి తెలిపారు, ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు తదితరులు పాల్గొన్నారు.






# రాష్ట్రంలో అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులను జారీ చేస్తాం

## జీవో 252 లో అవసరమైన మేరకు సవరణలు చేస్తాం

- జర్నలిజంతో సంబంధం లేనివారికి అక్రెడిటేషన్లు జారీ కాకుండ చూడాలి
- ఎలైట్ పీపుల్స్ నుంచి జర్నలిస్టులను తొలగించాలి
- తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కే.శ్రీనివాస్ రెడ్డి

**మేడ్చల్, రాజముద్ర న్యూస్:** రాష్ట్రంలో అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రెడిటేషన్ కార్డులు జారీ చేస్తామని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కే.శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. జర్నలిస్టు సంఘాలు, జర్నలిస్టుల అభ్యర్థన మేరకు 252 జీవోలో, అవసరమైన మేరకు సవరణలు చేసి డిపిఆర్ఓలకు పంపిస్తామని చెప్పారు. గురువారం మేడ్చల్ జిల్లాలోని ఎస్ఎన్ఆర్ పుష్ప కన్వెన్షన్ లో టియు డబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మీడియా అకాడమీ చేర్మెన్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, జర్నలిస్టులకు జారీ చేసే అక్రెడిటేషన్ కార్డుల విషయంలో ఎలాంటి అపోహలు పడవద్దని సూచించారు. గతంలో కంటే మెరుగైన జీవోను ఈ ప్రభుత్వం తీసుకువచ్చిందని చెప్పారు. సర్క్యులేషన్ ప్రాతిపదికన కార్డులను రాష్ట్ర, జిల్లా స్థాయిలో జారీ చేస్తారని అన్నారు. కేబుల్ ఛానల్ జర్నలిస్టులకు జారీ చేసే కార్డుల విషయమై సబ్ కమిటీ వేశామని ఆ కమిటీ నివేదిక మేరకు నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు. పెద్ద పత్రికల జర్నలిస్టులేవరికీ అన్యాయం జరగదని, ఆయా పత్రికల్లో డెస్క్ సబ్ ఎడిటర్లుగా పనిచేస్తున్న వారందరికీ అక్రెడిటేషన్ కార్డులు మంజూరు చేస్తారని అన్నారు. జర్నలిజం వృత్తితో సంబంధం లేని వారికి అక్రెడిటేషన్లు జారీ కాకుండా యూనియన్ బాధ్యులు జాగ్రత్త వహించాలని సూచించారు. నకిలీ జర్నలిస్టులకు కార్డులు అందకుండా అడ్డుకోవాలని అన్నారు. అక్రెడిటేషన్ కమిటీ సభ్యులకు త్వరలోనే సమావేశం ఏర్పాటు చేసి వారికి కూడా అవగాహన కల్పిస్తామన్నారు. హైదరాబాద్ లోని జవహర్ లాల్ నెహ్రూ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ సభ్యులకు ఇచ్చినటువంటి ఇళ్ల స్థలాలపై సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఇచ్చిన తీర్పు అభ్యంతరకరమైందని, ఐఏఎస్, ఐపిఎస్ లు, ఎమ్మెల్యేల జీవితాలతో జర్నలిస్టులను పోల్చడం అభ్యంతర కరమైందన్నారు. జర్నలిస్టులు ఉన్నత వర్గాలు కాదని, ఇటీవల విజయవాడలో జరిగిన ఐజేయు ప్లీనరీ సమావేశంలో తీర్మానం చేసినట్లు ఆయన తెలిపారు. ఐజేయు స్టీరింగ్ కమిటీ సభ్యులు దేవులపల్లి అమర్ మాట్లాడుతూ సంఘం సమావేశాల్లో తీసుకునే నిర్ణయాలను క్షేత్ర స్థాయిలోకి తీసుకువెళ్లాలని, సంఘం బలోపేతం కోసం పాటుపడాలని, సభ్యుల సంఖ్య ముఖ్యం కాదని, పనిచేయడం ముఖ్యమన్నారు. అర్హులైన జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డులు అందే విధంగా పాటుపడాలన్నారు. టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు కే. విరాహత్ అలీ మాట్లాడుతూ, ఆయా జిల్లాల్లో నిర్వహించాల్సిన మహా సభలను మే 15లోగా నిర్వహించాలని మరికొన్ని జిల్లాల సభలను జూన్ 15 లోపు నిర్వహించాలని సూచించారు. రాష్ట్రంలో పనిచేస్తున్న అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు వచ్చే విధంగా యూనియన్ కృషి చేస్తుందని అన్నారు. అంతకుముందు మూడు మాసాల కాలంలో ప్రమాదాలు, అనారోగ్య కారణాలవల్ల మరణించిన 16 మంది జర్నలిస్టులకు నివాళి అర్పించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె రాంనారాయణ తన నివేదికను సమర్పించారు. ఈ సందర్భంగా సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. రాష్ట్రంలో అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేశన్ కార్డులు జారీ చేయాలని, ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే జర్నలిస్టులకు కూడా వైద్య సదుపాయాన్ని కల్పించాలని, ఐజేయు ప్లీనరీలో చేసిన తీర్మానం మేరకు హైదరాబాద్ లో జాతీయ మహిళా జర్నలిస్టుల సదస్సును ఏర్పాటు చేయాలని, జాతీయ న్యూస్ పేపర్స్ కన్ఫడరేషన్ జాతీయ సమావేశాన్ని హైదరాబాద్ లో నిర్వహించాలని తీర్మానించారు. అలాగే రాష్ట్రంలో జర్నలిస్టులపై నమోదవుతున్న కేసులపై నిజానిర్ధారణ చేసేందుకు గాను, సీనియర్ పాత్రికేయులతో త్రిసభ్య కమిటీని నియమించాలని సమావేశం నిర్ణయించింది. ఈ సమావేశ నిర్వహణకు మేడ్చల్ జిల్లా కమిటీ ఆతిథ్యాన్ని ఇచ్చింది. ఈ సమావేశానికి రాష్ట్ర కార్యవర్గంతో పాటు 29 జిల్లాల యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు హాజరయ్యారు. ఇంకా ఈ సమావేశంలో ఐజేయు స్టీరింగ్ కమిటీ సభ్యులు ఎం.ఏ మాజీద్, జాతీయ ఉపాధ్యక్షులు వై.నరేందర్ రెడ్డి, జాతీయ కార్యవర్గ సభ్యులు నగునూరి శేఖర్, కే సత్యనారాయణ, అజిత, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కే. రాములు, కోశాధికారి మోతే వెంకట్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఫైసల్ అహ్మద్, బుర్ర సంపత్ కుమార్ గౌడ్, గాడిపల్లి మధు, రాష్ట్ర కార్యదర్శులు వరకాల యాదగిరి, శ్రీకాంత్ రెడ్డి, గుండ్రాతి మధు గౌడ్, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు జి.బాల్ రాజ్ గౌడ్, కార్యదర్శి వెంకట్రాంరెడ్డి, వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

**నందిని సిద్దారెడ్డికి సన్మానం..**

కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు పొందిన నందిని సిద్దారెడ్డిని టియూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గం ఘనంగా సన్మానించింది. గురువారం అంతాయిపల్లిలోని ఎస్ ఎన్ ఆర్ ఫంక్షన్ హాల్లో జరిగిన టి యు డబ్ల్యు జే రాష్ట్ర విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ తన 55 ఏళ్ల సాహిత్య జీవితంలో టి యు డబ్ల్యూజె తో తనకు 50 ఏళ్ల అనుబంధం ఉందని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను వెలికితీయడంలో జర్నలిస్టుల పాత్ర మరువలేనిదని ఆయన గుర్తు చేశారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రభుత్వాలు కృషి చేయాలని ఆయన కోరారు.

## నేలకొండపల్లిలో ఆప్ పార్టీ సమావేశంలో కౌలు రైతుల సమస్యలపై ఆగ్రహం



**ఖమ్మం, రాజముద్ర న్యూస్:** నేలకొండపల్లి మండలంలో ఆమ్ ఆద్మీ పార్టీ ఖమ్మం జిల్లా బాడీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం కౌలు రైతులను నిర్లక్ష్యం చేస్తోందని ఆప్ నేతలు తీవ్రంగా విమర్శించారు. సొంత జిల్లాలోనే వ్యవసాయ శాఖ మంత్రి ఉన్నప్పటికీ రైతులకు ప్రయోజనం కలిగే చర్యలు కనిపించడం లేదని ప్రశ్నించారు. మొక్కజొన్న కొనుగోలులో మార్క్ఫెడ్ ద్వారా నేరుగా కొనుగోలు చేస్తామని చెప్పినా, అనవసర ఆంక్షలతో రైతులను ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. ఎకరానికి 50 క్వింటాళ్లు పండినా కేవలం 26 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేస్తున్నారని, మిగతా ధాన్యం అమ్మడానికి దళారులపై ఆధారపడాల్సి వస్తోందని తెలిపారు. దళారులు తక్కువ ధరకు కొనుగోలు చేసి, డబ్బులు కూడా ఆలస్యంగా ఇస్తున్నారని రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కౌలు రైతులకు భూమి యజమాని అనుమతి తప్పనిసరి చేయడం అన్యాయమని, ఈ నిబంధనలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో కౌలు రైతులకు రక్షణ కల్పించేందుకు తీసుకొచ్చిన చట్టాలు అమలులో లేవని విమర్శించారు. ఈ పరిస్థితి మారకపోతే కౌలు రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు స్వర్ణసుబ్బారావు, ఉపాధ్యక్షులు పసుమర్తి శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ పరుచూరి నర్సింహారావు, ట్రెజరర్ కనకపూడి రవి కుమార్ పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తా: గట్టు మహేష్ గౌడ్

### టి.ఎస్.జే.యు పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడిగా ఘన నియామకం



**పెద్దపల్లి, ఏప్రిల్ 16, రాజముద్ర న్యూస్:** తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ (టి.ఎస్.జే.యు) పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడిగా సీనియర్ జర్నలిస్టు గట్టు మహేష్ గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు నారాగోని పురుషోత్తం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ సంయుక్తంగా ప్రకటిస్తూ మహేష్ గౌడ్కు నియామక పత్రాన్ని అధికారికంగా అందజేశారు. జిల్లా కమిటీ సభ్యులతో విస్తృతంగా చర్చించిన అనంతరం ఆయనను ఈ కీలక బాధ్యతలకు ఎన్నుకున్నట్లు రాష్ట్ర నాయకత్వం వెల్లడించింది. పత్రికా రంగంలో అనుభవం కలిగిన మహేష్ గౌడ్ నియామకం జర్నలిస్టులలో కొత్త ఉత్సాహాన్ని నింపిందని పలువురు అభిప్రాయపడ్డారు. జిల్లాలో జర్నలిస్టుల సమస్యలపై అవగాహనతో పాటు సంఘటనాత్మక నాయకత్వ లక్షణాలు ఉన్నందున ఆయన ఎంపిక సముచితమని పేర్కొన్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన గట్టు మహేష్ గౌడ్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి ఈ కీలక బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర నాయకత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం, భద్రత కోసం నిరంతరం కృషి చేస్తానని, జిల్లాలోని మీడియా ప్రతినిధులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ఎల్లప్పుడూ ముందుండి పనిచేస్తానని ఆయన స్పష్టం చేశారు. అదేవిధంగా, టి.ఎస్.జే.యు సంస్థను జిల్లాలో మరింత బలోపేతం చేయడం, సభ్యత్వ విస్తరణకు ప్రాధాన్యత ఇవ్వడం, జర్నలిస్టుల మధ్య ఐక్యతను పెంపొందించడం తన ప్రధాన లక్ష్యాలుగా ఉంటాయని తెలిపారు. జర్నలిస్టుల శిక్షణ కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలు, అత్యవసర పరిస్థితుల్లో సహాయ కార్యక్రమాలు చేపట్టేందుకు కృషి చేస్తానని వెల్లడించారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు నారాగోని పురుషోత్తం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల అనిల్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ అవునూరి సంపత్, కొయ్యల రాజమల్లు లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. వారి మార్గదర్శకత్వంలో సంఘాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. మహేష్ గౌడ్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన సందర్భంగా పలువురు జర్నలిస్టులు, ప్రజా ప్రతినిధులు, సామాజిక నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన నాయకత్వంలో జిల్లాలో జర్నలిస్టుల సమస్యలకు సమర్థవంతమైన పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి జర్నలిస్టులు, సంఘ సభ్యులు, పలువురు ప్రముఖులు పాల్గొని నూతన అధ్యక్షుడికి అభినందనలు తెలిపారు.

# నిబంధనలు విస్మరిస్తున్న పలు రైస్ మిల్లులు

- పలు మిల్లుల్లో కనిపించని ఫైర్ సేఫ్టీ
- పట్టించుకోని ఆయా శాఖల అధికారులు



**బీర్కూర్, రాజముద్ర న్యూస్:** కామారెడ్డి జిల్లా బీర్కూర్, నస్రుల్లాబాద్ మండలంలో ఉన్న కొన్ని రైస్ మిల్లులలో నిబంధనలను విస్మరిస్తున్నారు. నిబంధనలు పాటించని వాటిపై చర్యలు తీసుకోవాల్సి ఉండగా అధికారులు నిర్లక్ష్యం వహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. నిబంధనలు విస్మరిస్తున్న మిల్లులపై ప్రత్యేక కథనం.

**ఆ మిల్లుల్లో లేని కార్మిక చట్టం, ఎన్వోసి..**

బీర్కూర్, నస్రుల్లాబాద్ మండలాల్లోని పలు రైస్ మిల్లులు ఎన్వోసి పొందలేరనే ఆరోపణలు ఉన్నాయి. అదేవిధంగా కొన్ని రైస్ మిల్లులు కార్మిక చట్టాన్ని సైతం తుంగతలో తొక్కుతున్నట్లు సమాచారం. కార్మిక చట్టాలను పాటించని మిల్లులకు ఆ శాఖకు చెందిన అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉండగా, చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు సైతం ఉన్నాయి.

**ఫైర్ సేఫ్టి ఎక్కడ...?**

బీర్కూర్ ఉమ్మడి మండలంలో ఉన్న పలు మిల్లుల్లో ఫైర్ సేఫ్టి లేదు. ప్రస్తుతం అగ్ని మాపక వారోత్సవాలు జోరుగా కొనసాగుతున్నాయి. ఆ శాఖకు చెందిన అధికారులు అగ్ని ప్రమాదాలు జరగకుండా చూడాల్సి ఉంది. కానీ బీర్కూర్; నస్రుల్లాబాద్ మండలంలోని పలు రైస్ మిల్లుల్లో ఫైర్ సేఫ్టి లేకున్నా అగ్ని మాపక శాఖ అధికారులు చూసీచూడనట్లు ఉండటంపై సర్వత్రా విమర్శలు వెల్లువెతుతున్నాయి. అదేవిధంగా ఉమ్మడి బీర్కూర్ మండలంలోని పలు రైస్ మిల్లుల్లో నిబందనలను విస్మరిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. సంబంధిత శాఖ అధికారులు పర్యవేక్షణ జరిపితే మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి.

## వేసవికాలం వడదెబ్బ నుండి రక్షించుకోవడానికి తీసుకోవలసిన జాగ్రత్తలు

### వికారాబాద్ జిల్లా వైద్య శాఖ అధికారి స్వర్ణకుమారి



**వికారాబాద్, రాజముద్ర న్యూస్:** వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి ఆదేశానుసారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి స్వర్ణ కుమారి జిల్లా ప్రజలు వేసవి ఎండల నుండి రక్షించుకొనుటకు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి పత్రికా ప్రకటన విడుదల చేయడం జరిగినది. ప్రస్తుతం ఎండల తీవ్రత రోజు రోజుకు పెరుగుతుంది. ఉదయం 10 గంటలు దాటిందంటే సూర్యుడు భగభగ మండిపోతున్నాడు. ఈ వేడి, వడగాలుల నుండి రక్షించుకోకుండా ఏమాత్రం అలసత్వం వహించిన ఆసుపత్రి పాలు కావడం లేదా ప్రాణాంతకం కావచ్చు. కాబట్టి ప్రతి ఒక్కరూ ఎండ వేడి నుండి వడగాలుల నుండి రక్షించుకొనుటకు జాగ్రత్తలు పాటించాలి. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు అత్యంత జాగ్రత్తగా ఉండాలి. ఏప్రిల్ నెలలోనే ఎండల తీవ్రత ఈ విధంగా ఉంటే మే నెల నాటికి మరింత పెరిగి తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. ప్రతి ఒక్కరు వడగాలుల నుండి ఎండ వేడిమి నుండి రక్షించుకోవడం, తగు జాగ్రత్తలు పాటిస్తూ తమను తాము రక్షించుకోవడం అత్యంత అవసరమన్నారు.

**తీసుకోవలసిన జాగ్రత్తలు**

ప్రతిరోజు క్రమం తప్పకుండా ఎక్కువ నీరు తాగాలి. రోజుకు కనీసం నాలుగు నుంచి ఐదు లీటర్ల నీరు తాగాలి. నీరు, పళ్ళ రసాలు, కొబ్బరి నీళ్లు, మజ్జిగ ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. లేత వర్ణము తేలికైన కాటన్ దుస్తులు ధరించాలి. పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. శుభ్రంగా రెండు పూటలా స్నానం చేయాలి. మితంగా భోజనం చేయాలి ఇంట్లో కిటికీలు తెరిచి ఉంచాలి. ఫ్యాన్ వేసి చల్లగా ఉంచుకోవాలి. బయట తిరిగి వచ్చిన వెంటనే కొద్దిసేపు నీడలో కూర్చోవాలి. దీంతో శరీరం చల్లబడడంతో పాటు శరీరంలోని అవయవాలు కూడా చల్లబడుతాయి. ఎండలో తిరిగిన వారు కనీసం ఐదు నుంచి పది నిమిషాల పాటు నీడలో సేద తీరిన తర్వాత స్వచ్ఛమైన నీరు తాగాలి బయటకు వెళ్లేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి. సూర్య రష్మి ఎక్కువగా ఉన్న సమయంలో బయట తిరగకపోవడం మంచిది. ఒకవేళ వెళ్లాల్సి వస్తే టోపీ, స్కార్ఫ్ వంటివి వాడాలి. వదులైన కాటన్ దుస్తులు ధరించాలి. బయటకు వెళ్లినప్పుడు వెంట త్రాగునీటి వాటర్ బాటిల్ తీసుకొని వెళ్ళాలి. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఎండ వేడిమి ఎక్కువగా ఉంటుంది కాబట్టి బయటకు వెళ్లకపోవడమే మంచిది. రోడ్లమీద లభించే చల్లని రంగు పానీయాలు తాగరాదు.మాంసాహారం తగ్గించాలి మద్యం సేవించరాదు. నలుపు దుస్తులు, మందంగా ఉన్న దుస్తులు ధరించరాదు.

**వడదెబ్బ కు గురి అయిన వ్యక్తికి చేయాల్సిన ప్రతిమ చికిత్స**

వడదెబ్బ తగిలిన వ్యక్తిని త్వరగా నీడ గల ప్రదేశానికి చేర్చాలి. చల్లని నీటిలో ముంచిన తడి గుడ్డతో శరీరం తుడవాలి. శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి వచ్చేవరకు ఆ విధంగా చేస్తూ ఉండాలి. ఫ్యాను గాలి, చల్లని గాలి తగిలేలా ఉంచాలి. ఉప్పు కలిపిన మజ్జిగ కానీ, రూరల్ రీహైడ్రేషన్ ద్రావణం కానీ త్రాగించాలి. వడదెబ్బ తగిలి అపస్మారక స్థితిలో ఉన్న రోగికి నీరు త్రాగించకూడదు. వీలైనంత త్వరగా దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించాలి.



ఎం సి హెచ్ సెంటర్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ సంగీత సత్యనారాయణ

**వికారాబాద్, రాజముద్ర న్యూస్:** గురువారం రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ సంగీత సత్యనారాయణ ఐఏఎస్ వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఎం సి హెచ్ సెంటర్ ను, తెలంగాణ డయాగ్నస్టిక్ హబ్ ను ఆకస్మికంగా సందర్శించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి స్వర్ణ కుమారి కమిషనర్ కు ఎం సి హెచ్ సెంటర్ నందు పుష్పగుచ్చం అందజేసి స్వాగతం పలికారు. కమిషనర్ డయాగ్నస్టిక్ హబ్ ను సందర్శించి అక్కడ రోజువారిగా జిల్లాలోని వివిధ ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుండి వస్తున్న శాంపిల్స్ వివరాలు ఎప్పటికప్పుడు అందజేస్తున్న పరీక్ష ఫలితాల గురించి పరిశీలించారు. అనంతరం హబ్ లోని డయాగ్నస్టిక్ పరికరాలను వాటి పనితీరును అడిగి తెలుసుకున్నారు. రోజువారీగా సేకరించిన శాంపిల్స్ పరీక్షించి వెంటనే పేషంట్ కు సంబంధిత ఆసుపత్రి ద్వారా పరీక్ష ఫలితాలు అందజేయాలని ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వారిగా శాంపుల్స్ సేకరణ పరిశీలించినప్పుడు పూడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి గత నెల రోజుల నుండి శాంపిల్స్ సేకరించడం లేదని అందుకు గల కారణాలు వారి నుండి వివరణ తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని ఆదేశించారు. టీబీ రోగనిర్ధారణ జరిగిన వెంటనే చికిత్స ప్రారంభించి పూర్తి కాలం చికిత్స తీసుకునే విధంగా జాగ్రత్త వహించాలని ప్రతి టీబీరోగి యొక్క వివరాలను ఎప్పటికప్పుడు నిశ్చయ్ పోర్టల్ లో నమోదు చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం జరుగుతున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో అసంక్రమిత వ్యాధులు క్షయ వ్యాధి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలని సూచించారు. శిశు మరణాలను తగ్గించడం కోసం సంకల్ప కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్, ఆసుపత్రుల జిల్లా సమన్వయ అధికారి సమీక్ష, సమన్వయ సమావేశం నిర్వహించాలని సూచించారు. అనంతరం మాతా శిశు సంరక్షణ కేంద్రాన్ని సందర్శించి అక్కడ అందిస్తున్న సేవలను పరిశీలించడానికి నవజాత శిశు సంరక్షణ కేంద్రం, డెలివరీ రూమ్, పీడియాట్రిక్ వార్డు, స్కానింగ్ రూమ్, ల్యా బరేటరీ ని సందర్శించి అక్కడ అందిస్తున్న వివిధ రకాల సేవలను పరిశీలించారు. గర్భవతులకు, చిన్న పిల్లలకు ఏమాత్రం అసౌకర్యం కలవకుండా నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. కమిషనర్ తో పాటు టీబీ సంయుక్త సంచాలకులు డాక్టర్ రాజేశం, టీ హబ్ రాష్ట్ర సమన్వయ అధికారి డాక్టర్ నందిత ఉన్నారు. ఈ కార్యక్రమంలో టీబీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ రవీంద్ర యాదవ్, జి జి హెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రాజ్యలక్ష్మి , డి సి హెచ్ ఎస్ డాక్టర్ ఆనంద్, డిప్యూటీ డెమో వి శ్రీనివాసులు వైద్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రధానోపాధ్యాయుడి లక్ష్మీ నారాయణ సేవలు అభినందనీయం: మండల విద్యాధికారి రాయల వీరస్వామి

### వేతనంలో నుండి 38 వేలతో పాఠశాలకు గేటు-నేమ్ బోర్డు ఏర్పాటు




**ఖమ్మం, రాజముద్ర న్యూస్:** పాఠశాల విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించడమే కాకుండా,సొంత నిధులు వెచ్చించి పాఠశాల సర్వముఖాభివృద్ధికి కృషి చేస్తున్న ప్రధానోపాధ్యాయులు ఏ.లక్ష్మీనారాయణ సేవలు అభినందనీయం అని కూసుమంచి మండల విద్యాధికారి రాయల వీరస్వామి అన్నారు.మండలంలోని పూరియాతండా ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏ.లక్ష్మీనారాయణ తన వేతనంలో నుండి 38 వేల రూపాయలు వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేసిన గేట్,నేమ్ బోర్డును గురువారం ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భద్రత,పాఠశాల అభివృద్ధి పట్ల నిబద్ధతకు లక్ష్మీనారాయణ పని తీరు నిదర్శనమని తెలిపారు.అనంతరం పలువురు ఉపాధ్యాయులతో కలసి ఆయనను అభినందించారు.ఈ కార్యక్రమంలో పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఎం.నాగేశ్వరరావు, కే.అనంత్ కుమార్,శ్రీనివాస్ గౌడ్,రామభద్రం,సలీమా, కోటాచారి,సిఆర్పి జాఫర్ విద్యార్థులు,తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదం కలకలం

- అతివేగం కారణంగా ప్రమాదం
- పోలీసుల దర్యాప్తు ప్రారంభం



**అశ్వారావుపేట, ఏప్రిల్ 16 రాజముద్ర న్యూస్:** అశ్వారావుపేట రింగ్ రోడ్డు నుండి అగ్రికల్చర్ కాలేజీ వరకు ఉన్న మార్గంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదం స్థానికంగా కలకలం రేపింది. రైతు వేదిక సమీపంలో కెమిలాయిడ్స్ కంపెనీకి చెందిన ట్రాక్టర్‌ను లారీ అతివేగంగా ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది.ఈ ఘటనలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. మరో ఇద్దరు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని తెలుస్తోంది. ప్రమాదానికి అతివేగం ప్రధాన కారణంగా ప్రాథమికంగా భావిస్తున్నారు.అశ్వారావుపేట–అగ్రికల్చర్ కాలేజీ మార్గంలో వాహనాలు అధిక వేగంతో ప్రయాణిస్తుండటంతో ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. రహదారి భద్రతా చర్యలు మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు. ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని సీఐ నాగరాజు రెడ్డి పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదానికి సంబంధించిన వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం.

## రేషన్ షాప్ ఏర్పాటు



**బోనకల్, ఏప్రిల్ 16 రాజముద్ర న్యూస్:** బోనకల్, రావినూతల గ్రామాల్లోని 12వ వార్డు ప్రజల కోసం నూతన రేషన్ షాప్ ఏర్పాటు చేయాలని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు రావుట్ల సత్యనారాయణ కోరారు. ప్రజా పాలన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, సుమారు 600 మంది జనాభా ఉన్న ఈ ప్రాంత ప్రజలు రేషన్ బియ్యం కోసం రెండు కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వస్తుందని తెలిపారు. నూతన షాప్ ఏర్పాటు చేయడం అవసరమని సూచించారు.అదేవిధంగా డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, సీసీ రోడ్ల నిర్మాణం, రైల్వే అండర్ బ్రిడ్జి ఏర్పాటు, బస్టాండ్‌లో బస్సుల రాకపోకలు పెంపు వంటి సమస్యలను కూడా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ డైరెక్టర్ భోజడ్ల అప్పారావు, నారాయణపురం వైస్ సర్పంచ్ కరివేద కనకరావు పాల్గొని వినతిపత్రం అందజేశారు.

# 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికతో సమగ్ర మార్పు తీసుకురావాలి

- సమన్వయంతో సమస్యలు పరిష్కరించాలి
- భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి పకడ్బందీ చర్యలు
- ఇంటిగ్రేటెడ్ భూ భారతి పైలట్ పోర్టల్ ప్రాజెక్ట్ గా కూసుమంచి: జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**ఖమ్మం, రాజముద్ర న్యూస్:** తెలంగాణ ప్రభుత్వం తీసుకువచ్చిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యచరణతో గ్రామాలలో సమగ్ర మార్పు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు.కూసుమంచి మండల కేంద్రంలోని విజయరామ ఫంక్షన్ హాల్లో గురువారం నిర్వహించిన మండల స్థాయి ప్రజాపాలన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం మార్చి 6 నుండి ప్రతిష్టాత్మకంగా 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు.ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఏప్రిల్ 2న గ్రామ స్థాయి కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించామని,అదే విధంగా మండల కేంద్రాల్లో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికపై అవగాహన కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు.ఇటీవల కొత్తగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు ఉత్సాహంతో ఉన్నారని,వారిని సమన్వయం చేసుకుంటూ ప్రభుత్వ లక్ష్యాలను సాధించాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారని వెల్లడించారు.గ్రామాలు,మున్సిపల్ వార్డుల్లో ఉన్న సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం పెండింగ్ నిధులను విడుదల చేసిందని,ప్రతి గ్రామంలో ఉన్న సమస్యలను ప్రాధాన్యత క్రమంలో గుర్తించి పరిష్కరించాలని,ముఖ్యంగా శానిటేషన్,వీధి దీపాల నిర్వహణ,మల్టీ పర్పస్ వర్కర్లకు సమయానికి వేతనాల చెల్లింపు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.

**సంక్షేమ పథకాలు ప్రజలకి చేరాలి..!**

కూసుమంచి మండలంలో తొలి విడతలో 690 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, ఇంకా ప్రారంభం కాని 43 ఇళ్ల నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించేలా సర్పంచులు,స్థానిక నాయకులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.కూసుమంచి మండలంలో కొత్త జూనియర్ కాలేజీ,100 పడకల ఆసుపత్రి నిర్మాణాలకు పునాది పడిందని,అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు.అదే విధంగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

**ఇంటిగ్రేటెడ్ భూ భారతి పోర్టల్ పై సమీక్ష**

భూ సమస్యలకు పరిష్కారం కోసం రెవెన్యూ,ల్యాండ్ సర్వే,రిజిస్ట్రేషన్ విభాగాలను ఒకే గొడుగు క్రిందకు తెస్తూ ఇంటిగ్రేటెడ్ భూ భారతి పోర్టల్ ను ప్రభుత్వం పైలట్ ప్రాజెక్ట్ క్రింద జిల్లాలోని కూసుమంచి మండలంలో ప్రవేశపెట్టిందని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు.అధికారులతో చేపట్టిన సమీక్షలో తహసిల్దార్ కార్యాలయంలో భూములు రిజిస్ట్రేషన్ చేసే సమయంలో సర్వే మ్యాప్ లు అందించే దిశగా పోర్టల్ రూపొందించడం జరిగిందన్నారు.రైతులు ఇంటి వద్ద నుంచి కూడా స్లాట్ బుకింగ్ చేసుకునేలా పోర్టల్ తయారు చేశామని, రైతులు లాగిన్ కాగానే భూమి వివరాలు కనిపిస్తాయని, ఎన్ని ఎకరాలకు సర్వే కావాలో కోరితే అందుకు సంబంధించిన ఫీజు చెల్లించిన తర్వాత గ్రామంలోని లైసెన్స్ సర్వేయర్ లాగిన్ కు వెళ్తాయని,రెండు రోజుల్లో ఆ రైతు భూమికి సరిహద్దు ఉన్న రైతులకు నోటీసులు జారీ చేసి ఏడు రోజుల లోపు సర్వే పూర్తి చేస్తారని,ఈ వివరాలను సర్వేయర్ సిస్టంలో నమోదు చేశాక దరఖాస్తుదారుడైన రైతు సర్వే మ్యాప్ కు యూనిక్, భూధార్ నెంబర్లు కేటాయిస్తారని భూభారతి పోర్టల్ లో కూడా వివరాలు నిక్షిప్తమవుతాయని చెప్పారు.సర్వే పూర్తయిన తర్వాత సర్వే మ్యాప్ జనరేట్ చేసి పోర్టల్ లో అప్లోడ్ చేస్తారని ఈ ప్రక్రియలు దరఖాస్తు రిజిస్ట్రేషన్ ప్రారంభమైనప్పటి నుంచి పూర్తి వరకు ప్రతి దశలో పౌరుల రిజిస్టర్ మొబైల్ నెంబర్ కు మెసేజ్ వస్తాయని తెలిపారు.భూ భారతి కింద ఉన్న దరఖాస్తులన్నింటిని త్వరితగతిన పరిష్కారించేందుకు అధికారులు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అనుదీప్ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్,ఎంపీడీవో రాజారావు,తహసీల్దార్ సైదులు,ఏఓ వాణి,హెచ్ ఓ అపర్ణ,ఎంఈఓ వీరస్వామి,వైద్యాధికారి డా.సాయి,పశు వైద్యాధికారి డా.నీలకాంత్,వివిధ శాఖల అధికారులు,ప్రజాప్రతినిధులు,గ్రామదీపికలు, వార్డు సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.



# బ్యాటర్ అభిషేక్ శర్మ అంటే నాకు క్రష్

## స్మృతి మంధానపై వీడియో క్రియేట్

ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) టెక్నాలజీ సెలెబ్రిటీలకు శాపంగా మారింది. మంచికి వాడాల్సిన సాంకేతికతను కొందరు ఆకతాయిలు తప్పుడు పనులకు ఉపయోగిస్తున్నారు. ఏఐ సాయంతో నకిలీ ఫొటోలు, వీడియోలను సృష్టించి పలువురు ప్రముఖుల పరువును బజారున పడేస్తున్నారు. కాదేదు నకిలీకి అనర్హం అన్న రీతిలో ఏఐ టెక్నాలజీని వాడుతున్నారు. క్రీడాకారులపై డీప్ ఫేక్ ఫొటోలు, వీడియోలు రూపొందిస్తూ శునకానందం పొందుతున్నారు. పాత ఇంటర్వ్యూల వీడియోల సాయంతో అనని మాటలు అన్నట్లు మాయ చేస్తున్నారు. ఫేక్ అనే ఆలోచన కూడా రాకుండా వీడియో క్రియేట్ చేస్తున్నారు. దిగ్గజ క్రికెటర్ సచిన్ టెండూల్కర్ కుటుంబం నుంచి విరాట్ కోహ్లీ వరకు చాలా మంది ఆటగాళ్లు ఈ నకిలీగాళ్లతో ఇబ్బంది పడ్డారు. తాజాగా భారత మహిళా జట్టు వైస్ కెప్టెన్ స్మృతి మంధానకు సంబంధించి ఓ ఫేక్ వీడియోను సృష్టించి నెట్టింట వైరల్ చేశారు. ఏ మాత్రం సందేహం రాకుండా.. నిజమేనని నమ్మేలా వీడియోను క్రియేట్ చేస్తున్నారు. ప్రస్తుతం ఈ వీడియో ఇన్‌స్టాగ్రామ్‌లో హల్‌చల్ చేస్తోంది. స్మృతి మంధానకు సంబంధించి ఓ పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూను కేటుగాళ్లు పూర్తిగా మార్చేసారు. ఆ ఇంటర్వ్యూలోని వాయిస్ తీసేసి ఏఐ సాయంతో కొత్త వాయిస్‌ని జోడించారు. టీమిండియా యువ ఓపెనర్, సన్‌రైజర్స్ హైదరాబాద్ విధ్వంసకర బ్యాటర్ అభిషేక్ శర్మ అంటే నాకు క్రష్ అని స్మృతి మంధాన చెప్పినట్లుగా ఈ వీడియోను క్రియేట్ చేశారు. ఈ నకిలీ వీడియోలో హోస్ట్.. టీమిండియా ఆటగాళ్లలో మీ క్రష్ ఎవరా? అని అడగ్గా.. స్మృతి మంధాన అభిషేక్ శర్మ పేరు చెప్పింది. అక్కడికే కట్ చేసి.. బీసీసీఐ అవార్డ్స్ ఫంక్షన్‌లో అభిషేక్ శర్మ, స్మృతి మంధాన ఒకరినొకరు చూసుకున్నట్లుగా వీడియోను ఎడిట్ చేశారు. ఈ వీడియో నిజమేనని నమ్మిన నెటిజన్లు తమదైన శైలిలో కామెంట్ చేస్తున్నారు. ఏఐ టూల్స్ ద్వారా ఈ వీడియోను క్రాస్ చెక్ చేయగా ఫేక్ అని తేలింది. అసలు ఏ ఇంటర్వ్యూలో కూడా మంధాన తన క్రష్ అభిషేక్ శర్మ అని చెప్పలేదు. ఏ హోస్ట్ కూడా టీమిండియాలో మీ క్రష్ ఎవరా? అని అడగలేదు. అడగరు కూడా. ఈ లాజిక్ గుర్తించిన జనాలు ఈ వీడియో నిజమేనని నమ్ముతున్నారు. చాలా ఇంటర్వ్యూలలో స్మృతి మంధాన తన క్రష్ గురించి అడిగినప్పుడు, తనకు చిన్నప్పటి నుంచి బాలీవుడ్ హీరో హృతిక్ రోషన్ అంటే చాలా ఇష్టమని తెలిపింది. మ్యూజిక్ కంపోజర్ పలాష్ ముచ్చల్‌తో స్మృతి మంధాన ప్రేమాయణం నడిపింది. కానీ వీరి వివాహం పెళ్లి పీటలపై ఆగిపోయింది. ఆ తర్వాత ఈ ఇద్దరూ దూరంగా ఉంటున్నారు. పలాష్ ముచ్చల్‌కు ఇతర మహిళలతో సంబంధాలు ఉండటంతోనే స్మృతి పక్కనపెట్టిందని అప్పట్లో వార్తలు వచ్చాయి.

# వరల్డ్ టైటిల్ రేసులో వైశాలి

చెస్ ప్రపంచంలో భారత యువ కెరటం వైశాలి రమేష్ బాబు సరికొత్త చరిత్ర సృష్టించింది. ఉత్కంఠభరితంగా సాగిన మహిళల కాండిడేట్స్ టోర్నమెంట్ 2026లో విజేతగా నిలిచి ప్రపంచ ఛాంపియన్ టైటిల్ కోసం జూ వెన్‌జున్‌తో తలపడే అవకాశాన్ని దక్కించుకుంది. ఆఖరి రౌండ్లో రష్యా క్రీడాకారిణి కటెరినా లగ్నోపై అద్భుత విజయం సాధించిన వైశాలి రమేష్ బాబు.. మొత్తం 14 రౌండ్లలో 8.5 పాయింట్లు సాధించి అగ్రస్థానంలో నిలిచింది. దీంతో ప్లే-ఆఫ్స్ అవసరం లేకుండానే ఆమెను విజేతగా ప్రకటించారు. టోర్నీ ఆరంభంలో తక్కువ రేటింగ్ కలిగిన క్రీడాకారిణిగా బరిలోకి దిగిన వైశాలి, అసాధారణ ప్రతిభను కనబరిచింది. చివరి రౌండ్ మొదలయ్యే సమయానికి ఆరుగురు క్రీడాకారిణులు రేసులో ఉండటంతో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. అయితే వైశాలి తన ప్రత్యర్థి లగ్నోను తెలివిగా ఓడించి టైటిల్‌ను సొంతం చేసుకుంది. ఈ విజయంతో ఆమె తన రేటింగ్‌ను 26 పాయింట్ల వరకు పెంచుకోవడమే కాకుండా, తన కెరీర్‌లో అత్యుత్తమ మైలురాయిని చేరుకుంది. మరోవైపు బిబిసార అసౌబాయేవా తన చివరి గేమ్‌లో దివ్య దేశ్‌ముఖ్‌తో డ్రా చేసుకుని రెండో స్థానంతో సరిపెట్టుకుంది. ఝూ జిన్నర్, అలెగ్జాండ్రా గోర్యాచ్కినా సంయుక్తంగా మూడో స్థానంలో నిలిచారు. వైశాలి గెలుపుపై భారత చదరంగ దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్ హర్షం వ్యక్తం చేశారు. "వైశాలి అద్భుతమైన సన్నద్ధతను, పట్టుదలను ప్రదర్శించింది. కష్టాలను ఎదుర్కొని విజయాన్ని అందుకుంది. ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో ఇద్దరు భారతీయులు ఉండటం గర్వకారణం" అని ఆయన ప్రశంసించారు. వెస్ట్‌బ్రిడ్జ్ ఆనంద్ చెస్ అకాడమీలో శిక్షణ పొందిన వైశాలికి ఈ విజయం చాలా ప్రత్యేకం. గతంలో గ్రాండ్ స్విస్ టైటిళ్లను గెలుచుకున్న వైశాలి, ఇప్పుడు ప్రపంచ మహిళల చెస్ ఛాంపియన్‌షిప్ బెల్టుపై కన్నేసింది. చెన్నైకి చెందిన ఈ యువ గ్రాండ్ మాస్టర్, అంతర్జాతీయ స్థాయిలో భారతదేశ కీర్తిని మరోసారి ఇనుమడింపజేసింది. రాబోయే టైటిల్ పోరులో ఆమె జూ వెన్‌జున్‌కు గట్టి పోటీనిస్తుందని క్రీడా విశ్లేషకులు భావిస్తున్నారు.



# కింగ్స్ సూపర్ హిట్‌షో

## ముంబైని చిత్తు చేసిన పంజాబ్





**అజేయంగా నిలిచిన డీకాక్ పోరాటం**

**ఆకట్టుకున్న పంజాబ్ బౌలర్ల పనితీరు**

**ఛేజింగ్‌లో సిక్సర్ల వర్షం కురిపించిన బ్యాటర్లు**

**చేతులెత్తేసిన ముంబై బౌలింగ్ దళం**

**ఏడు వికెట్ల తేడాతో మురిసిన పంజాబ్**

**ముంబై, ఏప్రిల్ 16:** ఐపీఎల్ 2026 సీజన్‌లో పంజాబ్ కింగ్స్ అద్భుత విజయాన్ని నమోదు చేసింది. ముంబై వాంఖడే స్టేడియం వేదికగా గురువారం జరిగిన మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్‌ను 7 వికెట్ల తేడాతో చిత్తు చేసింది. టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న పంజాబ్ జట్టు.. తొలుత ముంబైని నిర్ణీత 20 ఓవర్లలో 195/6 స్కోరుకు పరిమితం చేసింది. ఆ తర్వాత 196 పరుగుల లక్ష్యాన్ని కేవలం 16.3 ఓవర్లలో 3 వికెట్లు మాత్రమే కోల్పోయి ఛేదించింది. పంజాబ్ బ్యాటర్ల ధాటికి ముంబై బౌలర్లు పూర్తిగా తేలిపోయారు. సొంత మైదానంలో ముంబైకి చేదు అనుభవం ఎదురైంది.

### ఒంటరి పోరాటం చేసిన డీకాక్

తొలుత బ్యాటింగ్ చేసిన ముంబై జట్టులో ఓపెనర్ క్వింటన్ డీకాక్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. పంజాబ్ బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ కేవలం 60 బంతుల్లోనే 112 పరుగులతో అజేయంగా నిలిచి అద్భుత సెంచరీ సాధించాడు. అతనికి తోడుగా నమన్ ధీర్ 31 బంతుల్లో 50 పరుగులు చేసి రాణించాడు. వీరిద్దరూ మినహా మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. కెప్టెన్ హార్దిక్ పాండ్యా 12 బంతుల్లో 14 పరుగులు మాత్రమే చేసి నిరాశపరిచాడు. పంజాబ్ బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్ తన పేస్‌తో ముంబైని దెబ్బతీశాడు. 4 ఓవర్లలో కేవలం 22 పరుగులు ఇచ్చి 3 కీలక వికెట్లు పడగొట్టి ముంబై భారీ స్కోరుకు కళ్లెం వేశాడు. శశాంక్ సింగ్, మార్కో జాన్సెన్ చెరో వికెట్ తీశారు.

### ప్రభ్‌సిమ్రన్, శ్రేయస్ విధ్వంసం

భారీ లక్ష్య ఛేదనలో పంజాబ్ కింగ్స్ ఎక్కడా తడబడలేదు. ఆరంభం నుంచే దాటిగా ఆడుతూ ముంబై బౌలర్లపై విరుచుకుపడ్డారు. ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్ కేవలం 39 బంతుల్లోనే 80 పరుగులు చేసి అజేయంగా నిలిచి జట్టు విజయానికి బాటలు వేశాడు. అతనికి జత కలిసిన శ్రేయస్ అయ్యర్ కూడా అద్భుతమైన స్ట్రైక్ రేట్‌తో బ్యాటింగ్ చేసి 35 బంతుల్లో 66 పరుగులు సాధించాడు. వీరిద్దరి విధ్వంసకర ఇన్నింగ్స్‌తో పంజాబ్ టార్గెట్‌ను సునాయాసంగా కరిగించింది. చివర్లో కూపర్ కొన్నోలీ 12 బంతుల్లో 17 పరుగులతో అజేయంగా నిలిచాడు. మరో 21 బంతులు మిగిలి ఉండగానే పంజాబ్ విజయం సాధించింది. ముంబై బౌలర్లలో అల్లా ఘజన్‌ఫర్ 4 ఓవర్లలో 31 పరుగులిచ్చి 2 వికెట్లు తీసి కాస్త మెరుగ్గా బౌలింగ్ చేసినా లాభం లేకపోయింది. శార్దూల్ ఠాకూర్ 3 ఓవర్లలో 42 పరుగులిచ్చి ఒక వికెట్ దక్కించుకున్నాడు. హార్దిక్ పాండ్యా 3 ఓవర్లలో ఏకంగా 39 పరుగులు సమర్పించుకుని తీవ్రంగా నిరాశపరిచాడు.



# బీసీసీఐకి చెన్నై సూపర్ కింగ్స్ ఫిర్యాదు!

**చెన్నై:** ఐపీఎల్ చరిత్రలో చెన్నై సూపర్ కింగ్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్ల మధ్య ఉండే వైరం గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. మైదానంలో ఆటగాళ్ల మధ్య ఉండే పోటీ, మైదానం బయట అభిమానుల మధ్య ఉండే సోషల్ మీడియా వార్ ఎప్పుడూ హాట్ టాపిక్‌గానే ఉంటుంది. అయితే, ఇప్పుడు ఈ వివాదం సరికొత్త స్థాయికి చేరుకుంది. మైదానం దాటి ఏకంగా భారత క్రికెట్ నియంత్రణ మండలి గడప తొక్కింది. బెంగళూరు వేదికగా జరిగిన మ్యాచ్ సందర్భంగా ఆర్‌సీబీ ప్రదర్శించిన ఒక పాటపై సీఎస్‌కే మేనేజ్‌మెంట్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ అధికారికంగా ఫిర్యాదు చేసింది. నివేదికల ప్రకారం, చిన్నస్వామి స్టేడియంలో ఆర్‌సీబీ మరియు సీఎస్‌కే తలపడిన సమయంలో, స్టేడియం స్పీకర్లలో ఒక వ్యంగ్య గీతాన్ని ప్లే చేశారు. అందులో దక్షిణ భారత ఆహార పదార్థాలైన 'దోశ-ఇడ్లీ'లను ప్రస్తావిస్తూ చెన్నై జట్టును, అక్కడి సంస్కృతిని తక్కువ చేసి చూపేలా పదప్రయోగాలు ఉన్నాయని సీఎస్‌కే వాదిస్తోంది. ఇది కేవలం క్రీడా స్ఫూర్తిని దెబ్బతీయడమే కాకుండా, ఒక ప్రాంతీయతను హేళన చేసేలా ఉందని చెన్నై సూపర్



కింగ్స్ ఫ్రాంచైజీ తన ఫిర్యాదులో పేర్కొంది. సాధారణంగా ఐపీఎల్ మ్యాచ్‌ల సమయంలో జట్ల మధ్య 'బ్రాంటర్' (సరదా ఏడిపించుకోవడం) సహజం. కానీ, ఈసారి ఆర్‌సీబీ మేనేజ్‌మెంట్ హద్దులు దాటిందని సీఎస్‌కే ప్రతినిధులు భావిస్తున్నారు. "ప్రతి జట్టుకు ఒక గౌరవం ఉంటుంది. ఆహారపు అలవాట్లు లేదా ప్రాంతీయ భాషలను ఉద్దేశించి వ్యంగ్యంగా పాటలు రూపొందించి స్టేడియంలో ప్లే చేయడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. ఇది అభిమానుల మధ్య ఘర్షణలకు దారితీసే ప్రమాదం ఉంది" అని సీఎస్‌కే తన లేఖలో స్పష్టం చేసింది. ఈ ఫిర్యాదును అందుకున్న బీసీసీఐ వర్గాలు దీనిపై విచారణ జరుపుతామని హామీ ఇచ్చాయి. ఐపీఎల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ ప్రకారం.. ఏ ఫ్రాంచైజీ కూడా ఇతర జట్ల గౌరవానికి భంగం కలిగించేలా ప్రవర్తించకూడదు. స్టేడియంలో ప్లే చేసే కంటెంట్ మరియు పాటలపై నియంత్రణ ఉండాలని, దీనిపై ఆర్‌సీబీ మేనేజ్‌మెంట్ వివరణ కోరతామని బోర్డు ప్రతినిధి ఒకరు తెలిపారు. ఈ వార్త బయటకు రావడంతో సోషల్ మీడియా వేదికగా ఇరు జట్ల అభిమానుల మధ్య యుద్ధం మొదలైంది. సీఎస్‌కే అభిమానులు 'బెంగళూరు మేనేజ్‌మెంట్ సంస్కృతి ఇదేనా?' అని ప్రశ్నిస్తుంటే, ఆర్‌సీబీ ఫ్యాన్స్ మాత్రం 'అది కేవలం సరదా కోసం చేసిన పని, దీనిని ఇంత పెద్దది చేయాల్సిన అవసరం లేదు' అని కౌంటర్ ఇస్తున్నారు. గతంలో కూడా కోహ్లీ-ధోనీ అభిమానుల మధ్య జరిగిన వివాదాలు ఇప్పుడు ఈ 'దోశ-ఇడ్లీ' గొడవతో మళ్లీ రాజుకున్నాయి.

# 22 ఏళ్ల తర్వాత సూర్య–త్రిష జోడీ..

## ‘వీరభద్రుడు’పై పెరుగుతున్న అంచనాలు





కోలీవుడ్ స్టార్ హీరో సూర్య, దర్శకుడు ఆర్జే బాలాజీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ సోషియో ఫాంటసీ చిత్రం ‘కరుప్పు’పై ప్రేక్షకుల్లో ఆసక్తి రోజురోజుకూ పెరుగుతోంది. తమిళంతో పాటు తెలుగులో కూడా ఈ సినిమాకు మంచి క్రేజ్ ఏర్పడింది. తెలుగులో ఈ చిత్రాన్ని ‘వీరభద్రుడు’ అనే శక్తివంతమైన టైటిల్‌తో విడుదల చేయాలని నిర్ణయించారు. మే 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో ఈ సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో దర్శకుడు ఆర్జే బాలాజీ తాజాగా మీడియాతో మాట్లాడిన సందర్భంగా పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు. ఈ చిత్రంలో సౌత్ స్టార్ హీరోయిన్ త్రిష కథానాయికగా నటిస్తుండగా, సూర్య–త్రిష జోడీ మళ్లీ తెరపై కనిపించబోతుండటం అభిమానుల్లో ప్రత్యేక ఉత్సాహాన్ని కలిగిస్తోంది. గతంలో ‘ఆరు’ సినిమాలో కలిసి నటించిన ఈ జంట, దాదాపు 22 సంవత్సరాల తర్వాత మళ్లీ కలిసి నటించడం విశేషం. త్రిషతో పని చేయడం గురించి బాలాజీ మాట్లాడుతూ, చాలా కాలంగా ఆమెతో సినిమా చేయాలనుకున్నానని, ఈ ప్రాజెక్ట్ ద్వారా అది సాకారమైందని తెలిపారు. కథ వినగానే త్రిష వెంటనే అంగీకరించిందని, షూటింగ్ పూర్తయ్యాక కూడా ఆమె తరచూ సెట్స్‌కు వచ్చి యూనిట్‌ను ప్రోత్సహించిందని చెప్పారు. ఇక ఈ సినిమాకు సంగీత దర్శకుడిగా మొదట ఆస్కార్ అవార్డు గ్రహీత ఏఆర్ రెహమాన్‌ను ఎంపిక చేసినప్పటికీ, కొన్ని వ్యక్తిగత కారణాల వల్ల ఆయన ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నారని బాలాజీ వెల్లడించారు. ‘మూకుతి అమ్మన్’ తర్వాత కలిసి పని చేయాలని నిర్ణయించుకున్నప్పటికీ, ‘కరుప్పు’ షూటింగ్ సమయంలో ఆయన పూర్తి సమయం కేటాయించలేనని చెప్పడంతో నిరాశ కలిగిందని పేర్కొన్నారు. అయితే మధ్యలో ఒక పాట అత్యవసరం కావడంతో, సాయి అభ్యంకర్‌ను సంగీత దర్శకుడిగా తీసుకున్నామని తెలిపారు. మొత్తానికి, సూర్య–త్రిషల మధ్య కెమిస్ట్రీ ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. భారీ అంచనాల నడుమ ‘వీరభద్రుడు’ ప్రేక్షకులను ఎంత మేరకు ఆకట్టుకుంటుందో చూడాలి.



బ్లాక్‌బస్టర్ లేకపోయినా

# స్టైల్‌తో దుమ్మురేపుతున్న డింపుల్ హయాతి

తెలుగు, తమిళ చిత్రాల్లో 2017 నుంచి తన ప్రయాణాన్ని కొనసాగిస్తున్న నటి డింపుల్ హయాతి, ఇప్పటివరకు పెద్ద హిట్ సాధించకపోయినా తన ప్రత్యేకమైన స్క్రీన్ ప్రెజెన్స్‌తో మంచి గుర్తింపు తెచ్చుకుంటోంది. సినిమాల కంటే ఆమె స్టైల్, గ్లామర్ కారణంగానే సోషల్ మీడియాలో ఎక్కువగా చర్చకు వస్తోంది. తాజాగా ఆమె పంచుకున్న ఫోటోలు మరోసారి అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. డార్క్ బ్రౌన్ లేస్ దుస్తుల్లో కనిపించిన డింపుల్ ఎంతో హాట్‌గా, ఆకర్షణీయంగా కనిపించింది. వదిలేసిన కర్లీ జుట్టు, ఎక్స్‌ప్రెసివ్ కళ్ల చూపులు, కూల్‌గా కనిపించే ఆమె అటిట్యూడ్ అన్నీ కలిపి ఆమె లుక్‌ను మరింత ప్రత్యేకంగా మార్చాయి. ఎటువంటి ప్రత్యేక సందర్భం లేకపోయినా, కేవలం తన లుక్‌తోనే డింపుల్ హయాతి సోషల్ మీడియాలో హీట్ పెంచుతోంది. గ్లామర్, కాన్ఫిడెన్స్ కలయికతో ఆమె అభిమానులను ఆకట్టుకుంటూ ముందుకు సాగుతోంది.

‘పెద్ది’లో మాస్ సాంగ్‌కు కొత్త గ్లామర్..

# ఆయేషా ఖాన్ ఎంట్రీ?

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, దర్శకుడు బుచ్చిబాబు సనా కాంబినేషన్‌లో రూపొందుతున్న ప్రతిష్టాత్మక చిత్రం ‘పెద్ది’పై మరో ఆసక్తికర వార్త ఫిలింనగర్‌లో చర్చనీయాంశంగా మారింది. ఈ సినిమాలో ప్రత్యేకంగా రూపొందిస్తున్న మాస్ మసాలా పాట కోసం బాలీవుడ్ యంగ్ నటి ఆయేషా ఖాన్‌ను ఎంపిక చేయనున్నట్లు సమాచారం. ఇటీవల ‘ధురంధర్’ సినిమాలోని ‘షరారత్’ పాటతో సోషల్ మీడియాలో విపరీతమైన గుర్తింపు పొందిన ఆయేషా, తన డ్యాన్స్ మరియు గ్లామర్‌తో యూత్‌ను ఆకట్టుకుంది. ఆ పాటలో ఆమె ప్రదర్శన చూసిన దర్శకుడు బుచ్చిబాబు, రామ్ చరణ్ సరసన ప్రత్యేక సాంగ్‌కు ఆమెనే సరైన ఎంపికగా భావించినట్లు తెలుస్తోంది. చరణ్ వంటి ఎనర్జిటిక్ డ్యాన్సర్ పక్కన ఆయేషా ఉంటే, ఆ పాటకు మరింత క్రేజ్ రావడం ఖాయమనే అభిప్రాయం అభిమానుల్లో వ్యక్తమవుతోంది. ముందుగా ఈ స్పెషల్ సాంగ్ కోసం మృణాల్ ఠాకూర్, మానస వారణాసి పేర్లు వినిపించినప్పటికీ, ప్రస్తుతం యువతలో ఉన్న ట్రెండ్‌ను దృష్టిలో పెట్టుకుని ఆయేషా ఖాన్ వైపు చిత్రబృందం మొగ్గు చూపినట్లు టాక్. ఈ పాటకు సంగీత దర్శకుడు ఏ.ఆర్. రెహమాన్ ఊర మాస్ ట్యూన్ సిద్ధం చేస్తున్నారని, అది సినిమాకే ప్రత్యేక ఆకర్షణగా నిలవనుందని సమాచారం. మొదట ఏప్రిల్ 30న విడుదలకు సిద్ధమైన ఈ సినిమా, షూటింగ్ మరియు పోస్ట్ ప్రొడక్షన్ ఆలస్యం కారణంగా జూన్ 2026కి వాయిదా పడింది. అయితే, ఈ గ్యాప్‌లో వస్తున్న అప్‌డేట్లు మెగా అభిమానుల్లో ఆసక్తిని మరింత పెంచుతున్నాయి. ఉత్తరాది, దక్షిణాది ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఈ ప్రత్యేక పాటను ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో ఆయేషా ఖాన్ స్పెషల్ సాంగ్ ప్రధాన హైలైట్‌గా నిలుస్తుందని సినీ వర్గాలు అంచనా వేస్తున్నాయి.





# తమన్నాకు కోర్టులో నిరాశ..

## పవర్ సోప్స్‌పై పిటిషన్ తిరస్కరణ

నటి తమన్నా భాటియా దాఖలు చేసిన పిటిషన్‌పై మద్రాస్ హైకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ‘పవర్ సోప్స్’ కంపెనీపై ఆమె చేసిన ఆరోపణలకు సరైన ఆధారాలు సమర్పించలేకపోయినందున, కోర్టు ఆ పిటిషన్‌ను తిరస్కరించింది. ఇద్దరి మధ్య 2008లో బ్రాండ్ ప్రమోషన్‌కు సంబంధించిన ఒప్పందం కుదిరింది. ఆ ఒప్పందం ప్రకారం 2009 అక్టోబర్ వరకు మాత్రమే తమన్నా ఫోటోలను కంపెనీ ఉపయోగించుకోవాల్సి ఉంది. అయితే గడువు ముగిసిన తర్వాత కూడా 2010–2011 మధ్య తన చిత్రాలను అనుమతి లేకుండా వినియోగించారని తమన్నా ఆరోపించారు. ఈ నేపథ్యంలో కంపెనీపై చర్యలు తీసుకోవాలని, అలాగే తన ఫోటోలను ఇకపై ఉపయోగించకుండా ఆదేశాలు ఇవ్వాలని కోర్టును ఆశ్రయించిన ఆమె, రూ.కోటి నష్టపరిహారం కూడా కోరారు. ఈ కేసులో ముందుగా సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ ఆమె మరో పిటిషన్ దాఖలు చేశారు. అయితే, ఆ అప్పీల్‌ను విచారించిన ద్విసభ్య ధర్మాసనం, సింగిల్ జడ్జి తీర్పునే సమర్థిస్తూ తమన్నా పిటిషన్‌ను కొట్టివేసింది. దీంతో ఈ వ్యవహారంలో ఆమెకు న్యాయపరంగా ఎదురుదెబ్బ తగిలినట్లైంది.

Printed, Published and Owned by **RAVU RAJITHA,** Printed at **KAKATHIYA PRINTERS,** LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS,** Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684,** Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com